నవతెలంగాణ వరంగల్

ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

1

పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-వరంగల్

పదవ తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా మౌలిక వసతులు సరిగా ఉండాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ నగరంలోని కాశిబుగ్గ నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎల్బీనగర్‌లోని లేర్నర్స్ ల్యాండ్ కేంద్రాల్లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణను ఆకస్మికంగా సందర్శించి పరీక్ష రాసే విధానం, సరళిని పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను జిల్లా కలెక్టర్ చీఫ్ సూపరింటెండెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీలు జరగకుండా బాధ్యతగా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్స్‌ను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు సెల్ ఫోన్లు అనుమతించరాదని, పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు ఉండరాదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ప్రతిష్టంగా అమలు పరచాలని సంబంధిత పోలీసు అధికారులను కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పించిన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలు, మెడికల్ క్యాంప్ లను పరిశీలించి, నిరంతరం విద్యుత్ ఉండేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట తహశీల్దార్ మహ్మద్ ఇక్బాల్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నిర్ణీత గడువులోగా అభివద్ధి పనులు పూర్తి

- బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే



నవతెలంగాణ-వరంగల్

నిర్ణీత గడువులోగా అభివద్ధి పనులు పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమీషనర్ అశ్విని తానా జీ వాకడే అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పోతన నగర్ లో నిర్మించిన ల్యాండ్రో మార్ట్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ కు స్మార్ట్ సిటీ ప్రతినిధులు మార్ట్ లో ఉన్న మిషన్ల పనితీరు ప్రక్రియ తో పాటు యంత్రాల కమిషనింగ్ ను తెలియజేశారు, అనంతరం నిర్వహణ విధానాన్ని గురించి అడిగి తెలుసుకొన్న కమీషనర్ మాట్లాడుతూ ల్యాండ్రో మార్ట్ ను బి సి వెల్ఫేర్ వారి కి నిర్వహణ కోసం అప్పగించడం జరుగుతుం దని తెలిపారు.అనంతరం భద్రకాళి బండ్ పై క్షేత్ర స్థాయి లో పర్యటించి, గతం లో వరదలు వచ్చిన క్రమం లో కట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించి ఇక్కడ వాల్వ్ నిర్మించే అవకాశాన్ని పరిశీలించాలని, బండ్ పై సుందరికరణ, అభివద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు,అక్కడి నుండి ఆరేపల్లి సమీపం లో గల గ్రాండ్ ఎంట్రన్స్ నిర్మాణ, రోడ్ విస్తరణ పనులు జరిగిన తరుణం లో పనులు జరిగిన ఏరియా లో కొలతలను పరిశీలించారు, ఇక్కడే స్ట్రాం వాటర్ డ్రైన్ పైపులు ఏర్పాటు చేసిన దష్ట్యా అట్టి ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్మితమైన రోడ్ కోర్ తీసి పరిశీలించి సమగ్ర సమాచారం తనకు అందజేయాలని ఇట్టి పనులను జూన్ లోగా పూర్తి చేయాలని కమీషనర్ ఇంజనీరింగ్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బల్దియా ఎస్సీ ప్రవీణ్ చంద్ర, ఈ ఈ సంజయ్ కుమార్,డీఈలు రవికుమార్, రవి కిరణ్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా బాడ్మింటన్ పోటీలో విజేత ఏసీపీ జితేందర్‌రెడ్డి

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



హైదరాబాద్‌లో ఈనెల 17వ తేదీ నుండి పుల్లెల గోపీచంద్ అకాడమీలో నిర్వహించిన 16వ ఆలిండియా పోలీసు బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఏసిపి ఎం.జితేందర్‌రెడ్డి కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏసిపిగా విధులు నిర్వహిస్తున్న జితేందర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగం తరుపున పాల్గొని 55 ఏండ్ల విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలో అడిషనల్ ఎస్పీ వెంకట్రావుతో కలిసి ఆడి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆయన్ను అభినందించి ఘనంగా సత్కరించారు. గతంలో జితేందర్‌రెడ్డి జాతీయస్థాయిలో నిర్వహించిన పోలీసు బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించడంతోపాటు పలు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలను సాధించారు. జితేందర్‌రెడ్డిని పోలీసు క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని పోలీసు కమిషనర్ తెలిపారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట



క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి సరోజ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పీహెచ్‌సీలో ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ వ్యాధిలక్షణాల గురించి వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి తేమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు రమేల్, సువార్త, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ స్వరూపరాణి, హేమలత, ఫర్మసిస్ట్ లీలరాణి, శివాజీ, వెంకట్ రెడ్డి, లింగమూర్తి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు పాటుపడాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ



ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు యువత పాటుపడాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి చింతల అన్వేష్ పిలుపునిచ్చారు. నెహ్రు యువ కేంద్ర ఆధ్వర్యంలో శనివారం వరంగల్ నగరంలోని సీకేఎం కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అన్వేష్ మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించకుండా సానుకూల దక్పథంతో వారిని చూడాలన్నారు. అనంతరం కెఎంసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దురాలవాట్లకు లోను కాకుండా మంచి అలవాటు పెంచుకొని ఉత్తమపౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ ఆడెపు రామకష్ణ, కరుణ మైత్రి పాజిటివ్ నెట్‌వర్క్ ప్రతినిధి లావణ్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి, అనిల్ కుమార్, రవీందర్, ధర్మయ్య, డాక్టర్ గంగయ్య డాక్టర్ ఉదయలక్ష్మి సతీష్, డాక్టర్ కుమార్, ఆకులపల్లి మధు, కరుణ, సుమలత, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ



గంజాయి, గుట్కా, డ్రగ్స్, తదితర చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని ఏనుమాముల సీఐ పులి రమేష్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ సుందరయ్య నగర్‌లో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జాగతి పోలీస్ కళాబందంచే ప్రజలకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ పులి రమేష్ మాట్లాడుతూ చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్100, బాల్య వివాహాలు, సిసి కెమెరాలు ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలు, గుట్కా, గంజాయి, డ్రగ్స్ వల్ల యువకులు వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏనుమాముల ఎస్సై శ్రీకాంత్, నరసింహారావు, నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మహబూబాబాద్‌లో త్రిముఖ పోటీ







నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ పార్లమెంటు (ఎస్టీ) నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాన్ని సైతం ప్రారంభించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి మాలోత్ కవిత, బిజెపి అభ్యర్థిగా మాజీఎంపి అజ్మీరా సీతారాంనాయక్‌లను అభ్యర్థులుగా ఆయా పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. తొలుత కాంగ్రెస్‌పార్టీ భద్రాచలం నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ములుగు నియోజకవర్గంలోనూ మంత్రి సీతక్క నేతృత్వంలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ప్రచారాన్ని కొనసాగించారు. బిఆర్ఎస్, బీజేపీలు నేటికీ ప్రచారాన్ని ప్రారంభించలేదు.

ఈ పార్ల మెంటు నియోజకవర్గంలో ఒక్క భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగతా 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలవడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధనకు కృషి చేస్తున్నాయి.

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీల నుండి ఖరారైన అభ్యర్థులందరూ ఈ నియోజకవర్గం నుండి గతంలో ఎంపీలుగా ఎన్నికైన వారే కావడం గమనార్హం. ముగ్గురు అభ్యర్థులకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని7అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిచయాలున్నాయి. ఈ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని భద్రాచలం (ఎస్టీ)అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు విజయం సాధించారు. మిగతా మహబూబాబాద్, డోర్నకల్, ములుగు, పినపాక, ఇల్లందు, నర్సంపేట నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు సైతం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి శిష్యుడు కావడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో విజయంపై ధీమాతో వుంది. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గతంలో ఇక్కడి నుండి ఎంపిగా విజయం సాధించి కేంద్ర ప్రభుత్వంలో సహాయ మంత్రిగా పనిచేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న ధీమాతోవున్నారు.

- **అభ్యర్థులు ఖరారు.. ప్రచారం షురూ...!**

బిఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎంపి మాలోత్ కవిత సీనియర్ నేత, మాజీ మంత్రి డిఎస్ రెడ్యానాయక్ కూతురు. పార్టీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించినా నేటికి ప్రచారం ప్రారంభించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో సొంత నియోజకవర్గమైన డోర్నకల్‌లో తన తండ్రి డిఎస్ రెడ్యానాయక్ ఓడిపోయారు. బిజెపి అభ్యర్థి, మాజీ ఎంపి సీతారాంనాయక్ తాజాగా బిఆర్ఎస్‌ను వీడి బిజెపిలో చేరారు. బీజేపీలో చేరిన మూడ్రోజులకే ఆయనకు పార్టీ అభ్యర్థిత్వాన్ని బిజెపి కేంద్ర నాయకత్వం ఖరారు చేసింది. వీరు ముగ్గురు నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులే.

ముందే ప్రచారం ప్రారంభించిన కాంగ్రెస్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌కు ముందే భద్రాచలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి ఎన్నికల ప్రసంగం చేశారు. పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో ప్రచారంలో కాంగ్రెస్ పార్టీనే ముందంజలో వుంది. ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ శ్రేణులతో మంత్రి సీతక్క సైతం సమావేశం నిర్వహించి పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

'పొంగులేటి'కి ప్రతిష్టాత్మకం

మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంతోపాటు ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించడానికి ఆయన ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 3 అసెంబ్లీ నియోజకవర్గాలుంటాయి. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో డోర్నకల్ నియోజక వర్గంలో ఆయనకు బంధువర్గం వుంది. దీంతో మహబూ బాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లోభారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించి సత్తా చాటడానికి 'పొంగులేటి' తన దైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో తాజాగా డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ కీలక నేతలు నూకల నరేష్‌రెడ్డి నాయకత్వం పెద్ద సంఖ్యలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం.

షాక్‌లో బీఆర్ఎస్ ...

బీఆర్ఎస్ పార్టీకి వరుసగా షాక్‌లు తగులుతుండడంతో పార్టీ శ్రేణులు నిస్తేజంగా వున్నాయి. పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపి కవిత తన తండ్రి రెడ్యానాయక్ ఓటమితో డీలా పడిపోయారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌తో పార్టీ సీనియర్ నేతలు సైతం స్తబ్ధుగా వుండిపోయారు. ఈ నిస్తేజం నుండి కోలుకోవడానికి బిఆర్ఎస్‌కు చాలా సమయం పట్టే అవకాశం కనిపిస్తుంది. దీంతో ఇప్పటి వరకు పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీ సమావేశాలు నేటికీ ప్రారంభించలేదు.

'కమలం'లో నేతలేరీ..?

బిజెపి అభ్యర్థిగా అజ్మీరా సీతారాంనాయక్‌ను ప్రకటించినా నేటికీ పార్టీ సమావేశాలు గాని ప్రచారం గాని ఇక్కడ ప్రారంభం కాలేదు. దీని పరిధిలోని 7అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎక్కడా బిజెపికి గట్టి కేడర్ లేదు. దీంతో గెలుపు సాధ్యం కాదు. కాని పోటీనిచ్చే ప్రయత్నం చేయాలని కలమనాధులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పార్టీకి అభ్యర్థులు లేకపోవడం వల్లే బిఆర్ఎస్ నుండి వచ్చి చేరిన మూడ్రోజులకు సీతారాంనాయక్‌ను అభ్యర్థిగా ప్రకటించారు.

బిజెపికి గట్టి పునాదులు లేకపోవడంతో గట్టిపోటీనిచ్చే ఆస్కారం కూడా కనిపించడం లేదు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వం

- దేశంలో బీజేపీ ప్రభుత్వం గద్దె దించాలి
- సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నవతెలంగాణ-వరంగల్

కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగాల సంస్థలను దారాదత్తం చేస్తుందని అందుకే భారతదేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దేదించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఖండిస్తూ వరంగల్ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముక్కెర రామస్వామి అధ్యక్షతన కరీమాబాద్‌లో మోడీ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రతి పక్షాలన్ని ఈడీలపేర్ల తోనే భయ భ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు దాడులకు పాల్పడుతూ మళ్లీ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఏకపక్షంగా ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని అబద్ధాల ప్రచారం చేసుకుంటూ ప్రతిపక్షాలపై దాడినితీవ్రతరం చేస్తుందన్నారు. ఇప్పటికే దేశంలో నిత్యావసరాల సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ప్రజలు కార్మికవర్గం కొనే స్థితిలో లేరన్నారు. బీజేపీ విధానాల వల్ల భారతదేశంలో ఉన్న ప్రజలందరూ కడు పేదరికంలో మగ్గు తున్నారని దేశంలో అభివద్ధి ఎక్కడ కనబడడం లేదన్నారు. పెట్టుబడుదారులకు కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వరంగ సంస్థల ను ధారా ధత్తం చేస్తూ కార్మిక చట్టాలు అన్నిటిని కూడా హక్కులను కాలరాస్తూ దేశాన్ని అప్పల పాలు చేసిం దన్నారు. ప్రజానీకం మరోసారి బీజే పీ ప్రభుత్వాన్నీ గెలిపిస్తే భారతదేశం సర్వనాశనమై ఉద్యోగాలు, విద్యా, వైద్యానికి దూరమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల లో బిజెపిని ఓడించి సెక్యులర్ వామ పక్ష పార్టీలను గెలిపించాలని ప్రజలకు పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శి సిహెచ్ రంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్య రాలు నలిగంటి రత్నమాల, సింగారపు బాబు, జిల్లా కమిటీ సభ్యులు మాలోత్ సాగర్, అరూరి కుమార్, దుర్గయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి ప్రశాంత్, దివ్య, పెంటయ్య, జుబేదా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన వియత్నాం దేశస్తులు



నవతెలంగాణ-వరంగల్

చారిత్రకమైన ఖిలావరంగల్ కోటను మర్రి చెన్నా రెడ్డి మానవవనరుల అభివృద్ధి శిక్షణా కేంద్రం, ప్రెస్మీడియా హైదరాబాద్లో శిక్షణ పొందుతున్న వివిధ ప్రభుత్వ సంస్థల మీడియాలో పనిచేస్తున్న 26 మంది వియత్నాం దేశస్థులు, శనివారం తిలకించారు. కాకతీయ రాజులు పరిపాలించిన కాలం నాటి ఖిలావరంగల్ మధ్య కోటలోని శిల్పాలను వియత్నాం దేశస్తులు స్టడీ టూర్లో భాగంగా తిలకించారు. వారికి స్థానిక గైడ్ కిరణ్ ప్రకాష్ కాకతీయుల కాలంనాటి చరిత్ర, విశేషాలను వారికి వివరించారు. వారు ఖిలావరంగల్ కోటలోని కీర్తి తోరణాలు, శిల్పాల ఆవరణతోపాటు గుండంచెరువు, ఖుష్‌మహల్, సింగారపు బావి, రాతి, మట్టి కోట తదితర కట్టడాలను వారు ఆసక్తిగా తిలకించారు. అద్భుతమైన కళాఖండాలు, శిల్పసంపదలు, కోట దశ్యాలను తమ వెంట తెచ్చుకున్న కెమెరాల్లో బంధించారు. అనంతరం వేయిస్తంభాల దేవాలయం భద్రకాళి దేవాలయంలో సందర్శించారు.

వీరి వెంట హైద్రాబాద్ డాక్టర్ ఎంసీబీ హెచ్‌ఆర్‌డి ఫాకల్టీ డాక్టర్ కే.సురేష్‌కుమార్, శ్రీనివాస్, డిపిఆర్ఓ అయుబ్‌అలీ, వరంగల్ ప్రాంతీయ శిక్షణ కేంద్ర మేనేజర్ కుమారస్వామి, సిఐ మల్లయ్య, ఎస్ఐ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా జరిగేలా పటిష్ట కార్యచరణ



నవతెలంగాణ-చెన్నారావుపేట

రాబోయే వేసవికాలంలో సమద్ధిగా తాగునీరు అందించే విధంగా పటిష్ట కార్యచరణ రూపొందించి దాని అమలుకు కషి చేయాలని ఎంపీడీవో గోవిందరావు అన్నారు. శనివారం మండల సమావేశం మందిరంలో ఎంపీడీవో గోవిందరావు, ఎంపీఓ శ్రీధర్ రాజులతో కలిసి వేసవి కాలంలో తాగునీటి సరఫరా పై పంచాయతీ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, పక్క ప్రణాళికతో చర్యలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటిని సరఫరా చేయవచ్చు అన్నారు. మండలంలో 30 గ్రామాల్లో క్లోరోస్కోపు టెస్టింగ్ కిట్టుల డేటా నమూనాలను పరిశీలించాలన్నారు. ప్రతి గ్రామంలో వార్డులు చివరి హ్యాబిటేషన్ వరకు తాగిన పరిస్థితిపై మండల పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవిక నివేదికనందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీఓ శ్రీధర్‌రాజ్, డిఎంబి గ్రేడ్ ప్రదీప్, ఏఈఈ ఇంచార్జి మంగినీయా నాయక్, ల్యాబ్ అసిస్టెంట్ అశోక్, ఎం బి, పంచాయతీ సెక్రెటరీ లు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి : జిల్లా స్వీప్ నోడల్ అధికారి



నవతెలంగాణ-వరంగల్

18 ఏండ్లు నిండిన ప్రతీ విద్యార్థిని ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధి కారి భాగ్యలక్ష్మి అన్నారు.సాధారణ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో స్వీప్-2024 కార్యక్రమంలో భాగంగా శనివారం వరంగల్ లోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాలలోని కళావేదిక హల్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నోడల్ అధికారి మాట్లాడుతూ ఓటుహక్కు ద్వారా మాత్రమే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని, 2024 ఏప్రిల్ 1 లోగా 18 ఏళ్లు నిండిన విద్యార్థినులు ఎపిక్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని, కేవలం ఓటుమాత్రమే వేయడమే కాకుండా కుటుంబ సభ్యులను చైతన్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ కోలా రాజేష్ కుమార్, మాలతి, కృష్ణవేణి, అనురాధ, విజయ్, మోహన్‌లు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని స్థానిక జెడ్పీఎస్ఎస్, మోడల్‌స్కూల్, టిఎస్ గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో డీఈవో వాసంతి శనివారం సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమం లో గణిత పరీక్ష తీరును,పలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డిసిసిబి సెక్రెటరీ గారే కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

అవినీతి రేషన్‌డీలర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట



ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం సరఫరాలో సంబంధిత డీలర్లు తూకంలో మాయా జాలం చేస్తూ కార్డుదారులను మోసం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగుల పవన్ కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసిల్దార్ సుభాషిణికి రేషన్ డీలర్ల పైన చర్యలు తీసుకోవాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడుతూ బియ్యం సరఫరా లో ఒక్కొక్క కార్డుదారునికి మూడు కిలోల వరకు మోసం చేస్తూ పేద ప్రజల పోట్టకొడుతూ సొమ్ముచేసుకుంటున్నారని అన్నారు. ఈ మేరకు తహసిల్దార్ రేషన్ షాప్ లను తనిఖీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజశేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని కల్లెడ శివారు ముంజాలతండాలో శనివారం రమావత్ వెంకన్న (37) విద్యుత్ షాక్‌తో ప్రమాదవశాత్తు మతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకన్న తన ఇంటికి గోడకు నీరుపట్టేందుకు దగ్గరలోని కెనాల్ వద్దకు వెళ్ళి కరెంటు మోటార్ ను ఆన్‌చేస్తున్న క్రమంలో పాడైపోయిన కరెంటు వైరు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోతు రవి, బానోతు తిరుపతి, రమేష్, నీలం శ్రీనివాస్, దండపల్లి సైదులు, మాలోతు సెత్రాం, ఈర్య నాయక్, యాకయ్య, ప్రసాద్, రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-చెన్నారావుపేట

33 /11 కెవి లింగగిరి , 33/11 కెవి పాపయ్యపేట సబ్ స్టేషన్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నర్సంపేట డిఈ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటల నుండి 10:30 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధి లో పలు గ్రామాలకు విద్యుత్తు నిలిపివేయడం జరుగుతుందన్నారు.

భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలి

- **హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా**



నవతెలంగాణ-ఆత్మకూరు

భవిష్యత్ తరాలకు నీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రతి చోట ఇంకుడు గుంతలు నిర్మించాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధశుక్ల అన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ట్రైన్ కలెక్టర్ శ్రద్ధశుక్ల తో పాటు డిఆర్‌డీఏ అధికారి నాగ పద్మజ పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో, తహశీల్దార్ కార్యాలయాల్లోని ఇంకుడు గుంతలను ఆమె పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పథకంలోని రికార్డులను సాఫ్ట్‌వేర్‌ను పరిశీలించి ఏపీఓ రాజిరెడ్డి తగిన సూచనలు చేశారు. అలాగే స్వర్ణ భారతి మండల సమైక్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైని కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లోని వర్షం నీరు ఇండ్లలోని మురికి నీరు ప్రతిఒక్క బొట్టు కచ్చితంగా భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ప్రతిఒక్కరు నీటినిల్వలు పెంచే విధంగా బాధ్యతగా వ్యవహరించాలని ఆమె సూచించారు. డ్రైనేజ్ ఎండ్‌లో ఇంకుడు గుంతలు ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి ,ఏటీఎం లలిత, ఈసీ రాము, టి ఏ లు సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం తనిఖీ చేశారు. కాజీపేట దర్గా, సోమిడిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు, పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య గురించి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, హెచ్‌ఎంలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట తహశీల్దార్ బావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫిషరీస్ మెన్ కార్యదర్శిగా సొప్పరి రాజేష్

నవతెలంగాణ-దామెర



రాష్ట్ర ఫిషరీస్ మెన్ కార్యదర్శిగా మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన సొప్పరి రాజేష్‌ను రాష్ట్ర ఫిషరీస్ మెన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆదేశాలు జారీ చేయగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని అన్నారు. తనకు కీలకమైన కార్యదర్శి పదవి ఇవ్వడం పట్ల హర్షంవ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మంత్రులు సురేఖ, సీతక్క, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, తదితర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

నవతెలంగాణ-నడికూడ

ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని పిఆర్టియు మండలశాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించడం శుభసూచకమని ఈ టెట్ నిర్వహణపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి ఉందన్నారు.టెట్ సర్టిఫికెట్ ఉంటేనే వారికి పదోన్నతులు కల్పించనున్నారని రాష్ట్రంలో చాలామంది ఉపాధ్యాయులకు టెట్ సర్టిఫికెట్ లేదని, దాం తో వారికి పదోన్నతులు నిలిపివేశారని ఇలాంటి ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్‌నిర్వహించి అందులో ఉత్తీర్ణులు పొందిన ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కుడా చైర్మన్‌ను కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-దామెర



ఇటీవల నూతనంగా కుడా చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రాం రెడ్డి నియామకంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల నాయకులు శనివారం పూల బొకేనందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్యం ప్రకాశ్ రెడ్డి, మండల కన్వీనర్ పోలేపాక శ్రీనివాస్, ఎంపీటీసీ కళా సుధాకర్, కిన్నెర కోటి, బిక్షపతి, లింగారెడ్డి, దుబాసి రాజేందర్, పోశయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-శాయంపేట



అనారోగ్యంతో బాధపడుతూ బాధను భరించలేక ఆత్మహత్యకు పాల్పడగా శనివారం వద్దుడు కుసుమ వెంకటయ్య (65) మతి చెందినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన వెంకటయ్య గత కొన్నిరోజులుగా వెన్నునొప్పి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేక శుక్రవారం ఇంట్లో ఉన్న గడ్డిమందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్ళగా, గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. వెంకటయ్య కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని చింత నెక్కొండకు చెందిన రైతు అక్కల మల్లయ్య(55) పాము కాటు తో మతి చెందాడు. మల్లయ్య గత ఐదురోజుల క్రితం తన పంట పొలానికి నీళ్ల కడుతుండగా పాముకాటు వేయగా చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం మతి చెందాడు. మృతుడి భార్య మనెమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై జి. వెంకన్న తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న మహిళ అరెస్ట్

నవతెలంగాణ-పర్వతగిరి

గుడుంబా తరలిస్తున్న మహిళను మండలకేంద్రంలో అదుపులో తీసుకున్నట్లు ఎస్సై జి.వెంకన్న తెలిపారు. నెక్కొండ మండలం మహబూబ్ నాయక్ తండాకు చెందిన బానోతు శ్రీలత గుడుంబా విక్రయించేందుకు వె ళుతుండగా అనుమానంతో తనిఖీ చేయగా ఎనిమిది లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు తెలిపారు. గుడుంబారు స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్లుగా ఆయన వివరించారు. ఎవరైనా గుడుంబాతయారుచేసిన, అమ్మకాలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యానికి మేలు

నవతెలంగాణ-భీమదేవరపల్లి



చిరుధాన్యాలతోనే ఆరోగ్యానికి మేలు కలుగుతుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ సుశీల అన్నారు. మండలంలోని ముల్కనూరు ఆరవ అంగన్వాడి సెంటర్లో పోషన్ పక్వాడా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పోషకాహారంపై ఆమె అవగాహన కల్పించారు. పండ్లు ఆకుకూరలతో పాటు చిరుధాన్యాల ఆవశ్యకత ప్రతిఒక్కరు తెలుసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రజిత, ఆయా స్వరూప, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం బతకాలంటే బీజేపీని ఓడించాలి

- **సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి**



నవతెలంగాణ-హన్మకొండ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ విధానాల మూలంగా దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ప్రజాస్వామ్య రక్షించాలంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్య దర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. శనివారం సిపిఎం రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగబద్ధంగా స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలైన ఈడి, ఐటీ, సిబిఐలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటుందని ఆయన విమర్శించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్టాలు ఉల్లంఘనలు జరుగుతున్న పట్టించుకోకుండా బిజెపి ఏతర రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపిలో చేరని వారిపై ఈ డి, ఐటి దాడులు జరుపుతున్నారని వారు బిజెపిలో చేరగానే దాడులు ఆపుతున్నారని అందులో భాగంగా లిక్కర్ స్కాం తో సంబంధం ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, తెలంగాణ ఎమ్మెల్సీ కవితలను సంవత్సరానికి పైగా చెప్తూ తీరా ఎన్నికల సమయంలోఅరెస్టులు చేయడం విడ్డూరమన్నారు. గత రెండేళ్లుగా నానబెడుతున్న ఢిల్లీ లిక్కర్ కేసు ప్రస్తుతం ఎన్నికల సమయంలో అరెస్టులు చేయడం ముమ్మాటికీ ఎన్నికలలో ప్రతిపక్షాలను బలహీనపరిచి బిజెపి అధికారంలోకి రావడానికి కుటిల ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్‌చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని బిజెపి చూస్తుందని తద్వారా ఇండియా కూటమిని దెబ్బతీసి రాజకీయ లబ్ధిపొందాలని బిజెపి చేస్తున్న కుటిల రాజకీయమని ఆయన మండిపడ్డారు.

ఇలాంటి నిరంకుశ విధానాలను ప్రజలు అర్థం చేసుకొని తిప్పి కొట్టాలని కాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బడా కాంట్రాక్టర్ల దగ్గర వారికి మేలు చేసి బిజెపికి 6500 కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిందన్నారు. ఎలక్ట్రోబాండ్ల వివరాలు ఎస్బిఐ ప్రకటించిన రోజే ప్రజల దృష్టి మళ్లించడానికి మాత్రమే కేజ్రీవాల్ , కవితల అరెస్టు నాటకమని అన్నారు. ఇదే లిక్కర్ స్కాం తో సంబంధం ఉన్న అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి ఈడి అరెస్టు చేసిందని అరెస్ట్ అయిన ఐదు రోజులలో 40 కోట్లు ఎలక్ట్రాన్ బండ్ల రూపంలో బిజెపి తీసుకున్నట్లు ఎస్బిఐ వెల్లడించింది తద్వారా ఆయనకు బెయిల్ వచ్చిందని తర్వాత అప్రూవల్ గా మారి కేజ్రీవాల్, కవిత అరెస్టులకు బిజెపి నే ప్రోత్సహించిందని ఆయన మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్టు అవినీతి మరకలతో నడుస్తున్న బిజెపి ఇండియా కూటమి పైన బలహీనం చేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఆలోచించి బిజెపిని చిత్తు చిత్తుగా ఓడించాలని చక్రపాణి ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్ వాంకుడోత్ వీరన్న, గొడుగు, వెంకట్, దోగ్గెల తిరుపతి, కాడబోయిన లింగయ్య, ధరావత్ భాను నాయక్ రాజు ,వి రాజు, ఓ.సాంబయ్య ,ఎం కుమారస్వామి, నాగరాజు , విజేందర్, రమా, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

- **ఎంపీ ఎన్నికల్లో ప్రతీబూత్‌లో కాంగ్రెస్‌కు మెజార్టీ రావాలి**
- **పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



నవతెలంగాణ-సంగెం

అసెంబ్లీ ఎన్నికల్లో కసి, పట్టుదలతో ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసే, ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురావడానికి సమిష్టిగా కృషి చేశారో, అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఎన్నికల గ్రామ, బూత్‌స్థాయి సమీక్ష సమావేశం నర్సంపేటరోడ్‌లోని ఊకల్ వద్దగల ఎస్ఎస్ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పోలింగ్ బూత్‌ల వారిగా సమీక్షించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో తనగెలుపు కోసం పట్టుదలతో కసితో పనిచేసిన కార్యకర్తలను, నాయకులను అభినందించారు. ఇదే పట్టుదల, కసితో రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ దుర్మార్గపు పాలన చేసిందని అభివృద్ధి పేరిట అందినంతా దోచుకుని వేల కోట్లు కేసీఆర్ కుటుంబం సంపాదించారని, బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. కార్యకర్తల కష్టంకు తోడు బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం రాష్ట్రంలో మార్పు కోరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. పార్లమెం ట్ ఎన్నికల తర్వాత ప్రజలు బీఆర్ఎస్‌ను బొందపెడతారని బీజేపీని తరిమి కొడతా రని ప్రజల ఆశీస్సులతో కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే రాబోతుందని వరంగల్ పార్లమెంటు స్థానాన్ని గెలిపించుకుంటే మరిన్ని నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు.

లీడర్ కంటే క్యాడర్‌కే ప్రాధాన్యతనిస్తా...

మీరు పార్టీకి అండగా ఉండండి నేను మీకు తోడుగా ఉంటా, కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటా, లీడర్ కంటే క్యాడర్ కు ప్రాధాన్యతను ఇస్తా, బ్లాక్ మెయిల్ రాజకీయాలను సహించను, గ్రూపులు కట్టవద్దని క్రమశిక్షణతో ముందుకు పోవాలని వ్యక్తిగత విభేదాలకు తావు లేకుండా పార్టీ లైన్‌లోనే ప్రతి కార్యకర్త పనిచేయాలి, బాధ్యతారాహిత్యాన్ని తాను సహించనని అన్నారు. మీ గ్రామ బూత్‌లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్లే మీ పని విధానానికి ప్రామాణికమని గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చిన గ్రామాలపై మండల నాయకత్వం ప్రత్యేక దృష్టిపెట్టి సమీక్షించాలని వచ్చే పార్లమెంటు ఎన్నికలు అయ్యేవరకు మండల నా యకత్వం గ్రామాల్లోనే ఉండి కార్యకర్తలను చైతన్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ బొమ్మల కటయ్య, మాజీ సర్పంచులు ఇండ్ల రవికుమార్, గూడ కుమారస్వా మి, నాయకులు మందాడి లక్ష్మారెడ్డి, జనగాం రమేష్, అచ్చ నాగరాజు,తీగల రాజేష్, అనిల్, పాషా, రమేష్, రాజు, సంధ్యారాణి, కవిత, రాధిక, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫోటోగ్రాఫర్ మృతి



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని ఎల్లాపూ ర్ శివారు బావుపేట క్రాసు రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలా పూర్ మండల కేంద్రానికి చెందిన ఫోటో గ్రాఫర్ పత్తిపాక శ్రీధర్ (40) చికిత్స పొందు తూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం... కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పత్తిపాక శ్రీధర్ (40) శుక్రవారం వృత్తి పని ముగించుకొని తన ద్విచక్రవాహనంపై హనుమకొండకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బావు పేట క్రాసురోడ్డు వద్ద కమలాపూర్ వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుండగా వెనక నుంచి వస్తున్న ఏపీ 36 ఏజీ 0007 స్విఫ్ట్ కారును అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీధర్‌కు తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. అతని పరిస్థితి విషమంగా ఉందని ఎంజీఎం వైద్యులు తెలిపగా మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు అసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుని సోదరుడు పత్తిపాక శ్రీనాద్ తెలిపారు. శ్రీధర్ మృతికి కారణమైన హన్మకొండ కేఎల్ఎన్ కాలనీకి చెందిన కారు డ్రైవర్ అన్నం ఇషాంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని మృతుని సోదరుడు శ్రీనాథ్ తెలిపారు. మృతుని సోదరుడు పత్తిపాక శ్రీనాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

పసరుగొండలో సీసీ కెమెరాల ఏర్పాటు



నవతెలంగాణ-దామెర

మండలంలోని పసురుగొండలో శనివారం ఆరు సీసీ కెమెరాలను గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దామెర ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న ట్రైనీ ఐపీఎస్ శుభం నగరాలే, అంకిత్‌కుమార్ సంక్వార్ ఐపీఎస్, ఏసీపీ కిషోర్‌కుమార్, రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్ సిబ్బంది పాల్గొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులకు అభినందనలు తెలియజేశారు.

నేడు పలు చోట్ల విద్యుత్ కోతలు

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని చింతగట్టు సబ్ స్టేషన్‌పరిధి పెంబర్తి, హసన్‌పర్తి ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి ఉ దయం 11 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు ఏఈ రాంశెట్టి మౌనిక వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెంబర్తి, హసన్‌పర్తి ఫీడర్‌లో పలు చోట్ల విద్యుత్ అంతరాయానికి కారణమవుతున్న చెట్ల తొలగింపుతో పాటు లైన్ క్లియరెన్స్ కోసం విద్యుత్ కోత విదిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి







నవతెలంగాణ-హన్మకొండ

భారతదేశంలో ఉన్న నేటితరం యువత విద్యార్థులు భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ముం దు కు నడవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. శనివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్థంతి సందర్భంగా బాలసము ద్రం లోని ఆశ్రమ పాఠశాలలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సెమినార్స్ నిర్వహించి వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ దేశ స్వాతంత్రం కోసం మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలుకానీయం అనే నినాదంతో బ్రిటిష్ పార్లమెంటు మీద పొగబాంబు వేసి తన చిన్న వయసులోనే ఈ దేశంకోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, అజయ్ హరీష్, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ కుమార్, లక్ష్మణ్ రాజ్ కుమార్ అంజలి, అనూష, శిరీష విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో

భగత్ సింగ్ 93వ వర్ధంతి సంద ర్భంగా వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఏఐఎస్ ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊట్కూరు ప్రణీత్ గౌడ్ ,భాషబోయిన సంతోష్ లు మాట్లాడుతూ విద్యార్థు లకు నష్టం చేసే నూతన జాతీయ విద్యావిధానాన్ని తక్షణమే బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేసారు. లేదంటే భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులను ఏకం చేసి నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసేంత వరకు పోరాటా లను ఉధృతం చేస్తామని అన్నారు. బీజేపీ, మోడీ నిజమైన దేశభక్తులైతే భగత్ సింగ్ కి భారతరత్న ఎందుకు ప్రకటించలేదో చెప్పాలని అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు, యువత పోరాడాలనీ ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్జి, సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్ జిల్లా నాయకులు సిపతి వినయ్ లు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

భగత్ సింగ్, రాజ్ గురు, సుగుదేవ్ వర్ధంతి సందర్భంగా హన్మకొండ సిపిఐ జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఈ దేశానికి స్వతంత్రం రావాలని యువతను ఐక్యపరచి స్వాతంత్ర ఉద్యమంలో భగత్‌సింగ్, రాజ్‌గురు. సుఖ్‌దేవ్ ఉరి కంభం ఎక్కే వరకు అంకితభావంతో కృషి చేశారని, ఆ మహనీయులను స్ఫూర్తిని తీసుకొని నేటి విద్యార్థులు యువకులు సామాజిక దృష్టితో రాజకీయాల్లోకి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, భాషబోయిన సంతోష్, ఏశబోయిన శ్రీనివాస్, ఊట్కూరి.ప్రణీత్ గౌడ్, కొట్టే వెంకటేష్, రవితేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణిని ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



నవతెలంగాణ-లింగాలఘణపురం

భూసమస్యల పరిష్కారంకోసం ఏర్పాటు చేసిన ధరణిని ఎప్పటికప్పుడు ఆప్‌డేట్ చేయాలని అధికారులను జిల్లాకలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసి రిపోర్టులను, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, తహశీల్దార్ వినయలత, ఎంపీఓమల్లికార్జున్ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ ఉన్నతికి పాటుపడతానని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ డంఖా ఎగరేయడం ఖాయమని వైస్ ఎంపిపి చల్లా సుధీర్ రెడ్డి అన్నారు.శనివారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితునై, కాంగ్రెస్ అంటేనే బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడి పనిచేస్తుందని పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. నియోజక వర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర ఆదేశానుసారం పని చేస్తామని అన్నారు. రానున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున అభ్యర్థిని గెలిపించడం లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో మారపాక రాములు, నాగరాజు, మోసిన్ అలీ, శ్రీను, అనిల్, గౌరేష్, రవి, రాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి వేతన ఇబ్బందులు..?

- ఉపాధి చూపే వారికే ఆర్థిక సమస్యలు
- 3 మాసాల క్రితం రెండు నెలల వేతనం చెల్లింపు
- మళ్లీ నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్
- ఫీల్డ్ అసిస్టెంట్లను పర్మినెంట్ చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు

నవతెలంగాణ స్టేషన్‌ఘనపూర్

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి చూపెడుతూ, పల్లెల్లో వలసలను అరికట్టేందుకు 2005లో ఏర్పాటైన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఉద్యోగులను వేతనాల ఇక్కట్లు వెంటాడుతున్నాయి. పేదలకు ఉపాధి చూపడంలో ఈజీఎస్ ఉద్యోగులదే కీలక పాత్ర. ఏడాదికి సరిపడా బడ్జెట్‌కు లోబడి ఉపాధి హామీ కూలీల సంఖ్యకు అనుగుణంగా పని దినాలను, పనులను ప్రతిపాదించడం మొదలు.. పనులను నమోదు చేసి నగదుచెల్లించే వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఔట్ సోర్సింగ్, ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఏ)/ కాంట్రాక్టు ఉద్యోగులకే బాధ్యతలు అప్పగించారు. వీరిలో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ అనే గ్రామ స్థాయి ఉద్యోగి నుంచి హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ అనే రాష్ట్ర స్థాయి ఉద్యోగి వరకు అందరూ ఔట్‌సోర్సింగ్ లేదా ఎఫ్‌టీఏలే. కాగా ఉపాధి హామీ పథకం భారమంతా కింది స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లపైనే ఎక్కువగా పనిభారం పడుతోంది.

భరించలేని పని ఒత్తిడి..

కార్యాలయ సిబ్బందికి జనవరి నుంచి జూలై వరకు పని ఒత్తిడి అధికంగా ఉంటుంది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఏపీఓ, ఈసీ/ జేఈలు ఉదయం 6 గంటలకే పని ప్రదేశాలకు చేరుకోవాలి. కూలీలను తదుపరి పని దినానికి సిద్ధం చేసేందుకు గ్రామాల్లో పరిశీలించాలి. ఉపాధి హామీ సిబ్బందితో పాటు పలుగు, పార పట్టుకుని పని చేయకున్నా.. ఫీల్డ్ అసిస్టెంట్ ఒక గ్రామపంచాయతీలో ఎన్నిచోట్ల పనులు జరిగితే అన్నిచోట్లకు వెళ్లి పరిశీలించడంతో పాటు కూలీలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. టెక్నికల్ అసిస్టెంట్లు క్లస్టర్ల వారీగా మండలానికి నలుగురు వరకు ఉంటారు. ఈసీ/జేఈఈ మండలానికి ఒక్కరే ఉంటారు. వీరు మండలంలో జరిగే ప్రతి పనిని నేరుగా పరిశీలించి కొలతలు సరిచూసుకుని టెక్నికల్ అసిస్టెంట్ నమోదు చేసిన ఎం బుక్‌ను స్ర్కూటినీ చేసి చెక్కులు సిద్ధం చేయాలి. ఈ చెల్లింపులన్నింటినీ కంప్యూటర్ ఆపరేటర్ కం



అకౌంట్స్ అసిస్టెంట్లు ఆన్‌లైన్ చేయాలి. సీజన్ (జనవరి నుంచి జూలై వరకు)లో వీరిపై పని ఒత్తిడి అధికంగా ఉంటుంది. గతంలో ఇందిరమ్మ ఇళ్ల, ప్రస్తుతం మరుగుదొడ్లు, సీసీ రహదారులు కూడా ఉపాధి హామీ పథకం ద్వారానే చేపడుతున్నారు. సమస్యల మధ్య పనిచేస్తున్న సిబ్బందికి కనీసం ఉద్యోగ భద్రత లేదు. సకాలంలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందిపడుతున్నారు.

జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు 171, ఇతర సిబ్బంది 68

గత ప్రభుత్వ హయాంలో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డా కూడా కొత్త సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లపైనే పని భారం పడుతుంది. జనగామ జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు 171, కంప్యూటర్ ఆపరేటర్లు, కమ్ అకౌంటెంట్లు 13, సాంకేతిక సహాయకులు 39, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు 8, సహాయ ప్రాజెక్ట్ అధికారులు 8మంది విధులు నిర్వహిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతీ గ్రామానికి ఒకరు ఉండాల్సింది పోయి 2,3 గ్రామాలకు ఒకరు చూసుకుంటున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు మండలానికి ఇద్దరూ ఉండాల్సి కాగా, 13 మండలాలకు 13మంది కొనసాగుతున్నారు.

నాలుగు నెలల వేతనాలు పెండింగ్..

ఉపాధి హామీ సిబ్బందికి ఆరునెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా రెండు నెలల వేతనాలు గత డిసెంబర్‌లో చెల్లించారు. ఇంకా నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో పెట్టారు. దీంతో ఈఎంఐలు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు చెల్లించేందుకు అప్పు చేయలేక నానా అవస్థలు పడుతున్నామని ఉపాధి హామీ ఉద్యోగులు వాపోతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను క్రమబద్ధీకరించాలి : రాపర్తి రాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



వేతనాలు సకాలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత ఉద్యోగులకు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగ భద్రత కల్పించాలి. శ్రమకు తగిన వేతనం రూ. 26వేలు తగ్గకుండా ఇవ్వాలి. పెండింగ్ వేతనాలు త్వరితగతిన అందించి, ప్రతీ నెలా సకాలంలో ఇవ్వాలి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను క్రమబద్ధీకరిస్తూ , ప్రభుత్వ ఉద్యోగ ప్రోత్సహకాలు అమలు చేయాలి.

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి : మంథపురం కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ల మండలాధ్యక్షులు



2005లో పథకం ప్రవేశపెట్టినపుడు ఎప్పటికైనా ఉద్యోగం పర్మనెంట్ కాకపోతుందా అనే ఆశతో విధుల్లో చేరాం. అప్పట్లో అహర్నిశలు పనిచేసేవాళ్లం. ప్రభుత్వ కార్యక్రమాలు ఏవయినా మా శాఖతో అను సంధానం అయి ఉంటాయి. ఇప్పటి దాకా ఉద్యోగా లు పర్మనెంట్ కాలేదు. కనీసం జీతాలైనా నెలనెలా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

వేతనాలు చెల్లించాలి : రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్



ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలు సకాలంలో చెల్లించాలి. నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంటి అద్దెలు, పాఠశాలల ఫీజులు, ఇతరత్రా ఖర్చులు భారమవుతున్నాయి. మా ఉద్యోగాలను కూడా రెగ్యులర్ చేయాలని పలుమార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.



భగత్ సింగ్ ఆశయాలు అనుసరణీయం : ఎన్ఎస్‌యుఐ

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

దేశ స్వతంత్ర పోరాటంలో స్వతంత్ర జ్వాలను రగిలించిన పోరాట యోధులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజగురుల ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభిగౌడ్ అన్నారు. శనివారం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు వర్ధంతి సందర్భంగా జనగామలో వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి పోరాట స్ఫూర్తి తరతరాలుగా గుర్తుండిపోతుందని, వారి నిస్వార్థ త్యాగాన్ని యువకులు, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ టౌన్ అధ్యక్షులు కార్తీక్, లింగాలగణపురం మండలాధ్యక్షుడు ధీరజ్, జనగామ మండలం ఉపాధ్యక్షుడు ప్రేమ్, గుణ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-రఘునాథపల్లి



షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఇంటి సామాగ్రి దగ్ధమైన సంఘటన శనివారం మండలంలోని ఖిలేషాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తాడూరి బండి శంకర్ పద్మ దంపతులు కిరాయికి ఉంటున్న ఇంట్లో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న సామానుతో పాటు నిత్యవసర సరుకులు దగ్ధమయ్యాయని, దాదాపుగా 80 వేలపైగా ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాపర్ వైర్ చోరీ



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కాంగ్రెస్ నాయకులు, చీటాకోడూర్ పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం రాత్రి దొంగలు ట్రాన్స్ఫార్మర్‌ను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్ఫార్మర్ కింద పడేసి పగలగొట్టి అందులో ఉన్న కాపరువైరు తగలబెట్టుకొని ఎత్తుకెళ్లారు. జనగామ మండలం వడ్లకొండగ్రామంలో జరిగిన ఈసంఘటనతో పాటు ఇటీవల కాలంలో పరిసరాల్లోని వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్ఫార్మర్ల దొంగతనాలు వరుసగా జరుగుతున్నాయి. బాధితుడు మల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రమణీయంగా తిరుమలనాథ స్వామి కళ్యాణం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



శ్రీ తిరుమల నాథ స్వామి కళ్యాణం కమనీయంగా డివిజన్ కేంద్రంలో శనివారం అర్చకులు, వేదపండితులు కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణోత్స క్రతువులో భాగంగాపుణ్యాహవచనం, శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కలకోట రంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కలకోట రామానుజ చార్యులు, శేషా చార్యులు, ఇతర అర్చకులతో వైభవంగా జరిపించారు. స్థానిక ఏసీపీ భీం శర్మ, అలాగే గన్ను వెంకట నారాయణ జ్ఞాపకార్థం యాగశాల నిర్మాణ దాత గన్ను శ్రీనివాస్, సునీత దంపతులు, నిఖిత, రితిక, కుంభం గణేష్ లావణ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గన్ను నర్సింహులు, చిగురు విజయ్, గన్ను శ్రీనివాస్, వెంకట నర్సయ్య, కొలిపాక సతీష్, గోలి రాజశేఖర్, మాజీ వార్డు సభ్యులు కుంభం నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

దర్గా పీఠాధిపతిని కలిసిన సాంబయ్య

నవతెలంగాణ-రఘునాథపల్లి



తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ కాజీపేట దర్గా పీఠాధిపతి హజరత్ సర్వర్ గులాం అఫ్జల్ బియబాని (కుసురు పాషా)ను ఆయన నివాసంలో శనివారం వరంగల్ పార్లమెంటు కాంటెస్ట్ అభ్యర్థి దొమ్మాటి సాంబయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట అబ్దుల్ హకీం, మహమ్మద్ ఇబ్రహీం భాషా, ఖాసిం ఖాన్ బియబాని, బాబా ఖాదర్ అలీ, వంగ మహేష్, ముప్పిడి శ్రవణ్ కుమార్, రవీందర్, దొంతుల శీను, దశరథ, అశోక్ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ-రఘునాథపల్లి



మహిళలకు, గర్భిణీలకు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ సరస్వతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. పూర్వ ప్రాథమిక విద్య గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ కవిత, ఏఎన్ఎం ధనలక్ష్మీ, అంగన్వాడి టీచర్లు శ్రీలత, కవిత, రేణుక, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 99.91 శాతం హాజరు : డీఈవో రాము

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా 41 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షలకు శనివారం 99.91 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో కే.రాము ఒక ప్రకటనలో తెలిపారు. 6698 మంది విద్యార్థులకు గాను 6692 మంది విద్యార్థులు హాజరయ్యారని, 6గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రైవేటు విద్యార్థుల్లో నలుగురు విద్యార్థుల్లో ఒకరు మాత్రం గైర్హాజర్ కాగా ముగ్గురు పరీక్ష రాసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ స్టేషన్ ఘన్పూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించినట్లు, ప్రత్యేక బృందాలు 13 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. మూడో రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

ప్రతిపక్షాలను బలహీనపర్చేందుకు బీజేపీ కుట్ర

- సీపీఎం జిల్లాకార్యదర్శి మోకు కనకారెడ్డి

నవతెలంగాణ-జనగామ

దేశంలో ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు బీజేపీ కుట్రలు పన్నుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విమర్శించారు. శనివారం సీపీఎం జిల్లా, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వామపక్ష పార్టీలు కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను వ్యతిరేకిస్తూ నిరసనలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు జనగామ పట్టణ కేంద్రంలోని నెహ్రూపార్క్ వద్ద బీజేపీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోకు కనకారెడ్డి పాల్గొని మాట్లాడుతూకేంద్ర బిజెపి ప్రభుత్వం యథేచ్ఛగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకొని కేంద్ర దర్యాప్తు సంస్థలు అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని, కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ని, ఆదాయ పన్ను విభాగం (ఐటి)ని దుర్వినియోగం చేస్తోందన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండించారు. ఇది చట్టవిరుద్ధమైన చర్య. రాబోయే ఎన్నికలను ప్రభావితం చేసేందుకే బిజెపి ఈ చర్యకు దిగిందన్నారు. ప్రతిపక్షాలను వేటాడేందుకు అధికార పార్టీ చాలా స్పష్టంగా ఈడిని అస్త్రంగా ఉపయోగిస్తోందని విమర్శించారు. ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రులను అరెస్టు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ కుటుంబాన్ని కూడా ఇతరులు కలవనివ్వకుండా ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఎన్నికల బాండ్లు బిజెపి తీసుకొచ్చిన అత్యంత అవినీతికర వ్యవస్థ అని విమర్శించారు.ఎన్నికల బాం



డ్ల వివరాలను ఎస్‌బిఐ సకాలంలో విడుదల చేయకపోవడం వెనుక బిజెపి ఒత్తిళ్లున్నట్లు కనిపిస్తోందని తెలిపారు. బాండ్ల పూర్తి వివరాల వెల్లడికి మోడీ బీజేపీ మూడు నెలల గడువు కోరడం సిగ్గుమాలిన తనానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్ష పార్టీలపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తుందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్న పట్టించుకోకుండా, బిజెపియేతర రాష్ట్రాల్లో మాత్రం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తుందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలు ఐక్యంగా బీజేపీ నిరంకుశ విధానాలను తిప్పికొట్టి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇ.అహల్య, పట్టణ కార్యదర్శి జె.ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు బి.గోపి, ఎస్.విజేందర్, నాయకులు బి.ధర్మభిక్షం, డి.సందీప్, బి.వెంకటమల్లయ్య ఎం.బీరయ్య, కె.లింగం, పి.కల్యాణి, వినోద్, ఆనందం, యాకన్న పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐల లక్ష రూపాయలు విరాళం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం స్టేషన్ మండల కేంద్రానికి చెందిన మారుతి నేని పాపారావు -క్రీ.శే.శ్రీలత వారి కుమార్తెలు మారుతినేని మమత-సమతలు వారి తల్లి మారుతినేని శ్రీలత జ్ఞాపకార్థం హైదరాబాదులో నిర్మించబోయే రైతు భవనంనకు లక్ష రూపాయల చెక్కును తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గుణగంటి రాజన్న, ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న, ఉపాధ్యక్షులు బొబ్బల యాకుబ్ రెడ్డి మారుతినేని పాపారావు, గుడిపాటి రాజారావు వెంకట్రెడ్డి రమేష్ సోమిరెడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర ఎంపీపీ పై నెగ్గిన అవిశ్వాసం

నవతెలంగాణ-పెద్దవంగర

బీఆర్ఎస్‌కు చెందిన పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరి పై అవిశ్వాసం నెగ్గింది. శనివారం తొర్రూరు ఆర్డీవో నర్సింగరావు అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. మొత్తం 9 మంది ఎంపీటీసీలు ఉండగా, ఇటీవల ఆరుగురు ఎంపీటీసీలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరారు. గతంలో వ్యక్తిగత కారణాల రీత్యా పెద్దవంగర ఎంపీటీసీ సభ్యుడు ఏదునూరి శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేశారు. ఎంపీపీ రాజేశ్వరి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సభ్యులను పట్టించుకోవడం లేదనే కారణాలతో గత కొన్ని రోజులుగా ఎంపీపీ పై ఎంపీటీసీలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 5న అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సూరయ్యకు అందజేశారు. అవిశ్వాస పత్రాన్ని పరిశీలించిన అనంతరం అధికారులు అవిశ్వాసానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శనివారం అవిశ్వాస సమావేశం నిర్వహించారు. మొత్తం 8 మంది ఎంపీటీసీల్లో ఎంపీపీ రాజేశ్వరితో పాటుగా, వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ సాయిని ఝాన్సీ గైర్హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీటీసీ సభ్యుల్లో వైస్ ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన (అవుతాపురం), బానోత్ విజయ (పోచంపల్లి), ఈరెంటి అనురాధ (గంట్లకుంట), ఎర్ర సబిత (కొరిపల్లి), బానోత్ రవీందర్ నాయక్ (బొమ్మకల్లు), మెట్టు సౌజన్య (చిన్నవంగర)లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో ఎంపీపీ తనపదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఆర్డీవో నర్సింగరావు మాట్లాడుతూ ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గడంతో పదవి కోల్పోయిందని, అవిశ్వాస పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్,ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లింగాలగణపురం

మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లావు వీరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం వారి కుటుంబాన్ని సంస్కృతి సేన రాష్ట్ర కార్యదర్శి, నేలపోగుల ఎంపీటీసీ డక్టర్ గుగ్గిల నర్సయ్య పరామర్శించారు. వారికి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి వారి కుటుంబానికి ఆర్థిక సాయం 50 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడవెల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు దండిగా ఐలయ్య, కత్తుల శ్రీనివాస్ రెడ్డి, కొండేటి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ నక్క రామచంద్రయ్య, కత్తుల శేఖర్ రెడ్డి, సంఘీ నరసింహులు, వేల్పుల అనిల్ యాదవ్, పాశం భాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహనీయుల వర్ధంతి

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే సెంటర్‌లో భగత్ సింగ్ రాజ్ గురు సుఖ్ దేవ్‌ల వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. అమీర వీరుల చిత్రపటానికి ఎంసిపిఐ (యు) పార్టీ మండల కార్యదర్శి ఎస్కే సలీం, బీసీ జాక్ మండల కో కన్వీనర్ సామల నరసయ్యలు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారిని ఉద్దేశించి ఎం సిపిఐ (యు)పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వారి ఆశయాల కోసం వారి పోరాటాలను ఆదర్శంగా తీసుకొని పోరాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిటియు సముద్రాల మల్లయ్య ,గంద్రకోటి యాకన్న ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జాటోత్ బిచ్చా నాయక్ ,మండల నాయకులు దయ్యాల కుమార్, ఏఐఎఫ్‌డివై ధరావత్ రమేష్, బీసీ జాక్ మండల కన్వీనర్ కొలిపాక వెంకన్న, ఐలయ్య, రవి, రాజు, సత్తి కేష్వా, చిట్ల సాంబ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గార్ల : విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట తత్వాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు,సుఖ్ దేవ్‌ల 93 వర్ధంతిని పురస్కరించుకొని సిపిఎం, ప్రజా సంఘాల అధ్వర్యంలో శనివారం పట్టణ పురవీధులలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి బస్సుస్టేషను ప్రాంగణంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ దుర్మార్గపు పాలనలో చిక్కుకున్న భారతదేశాన్ని విముక్తి కలిగించడానికి దేశ ప్రజలలో విప్లవ స్ఫూర్తిని నింపి భారత స్వాతంత్రోద్యమాన్ని కొత్త పంథా పట్టించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు భారత విప్లవానికి నిలువుటద్దంగా నిలిచారని చెప్పారు. భగత్ సింగ్ అలోచనలకు విరుద్ధంగా నేడు దేశంలోని పాలకులు మతాన్ని రాజకీయ సాధనంగా వాడుకుంటూ మతోన్మాద విధానాలతో తినే తిండిపై, కట్టేబట్టపై ఆంక్షలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, భగత్‌సింగ్ ఆశయ సాధనకు పాలకులు అవలంభిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాడాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు వి.వెంకటేశ్వర్లు, బి.లోకేశ్వరావు,ఎ.వీరాస్వామి,కె.ఈశ్వర్‌లింగం,ఎ.రామకృష్ణ,ఎస్.నాగరాజు, మౌలానా, జి.వీరభద్రం, సర్వర్, ప్రవీణ్, బి.రాజేష్,రమేష్, లల్లుట రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొడకండ్ల

రాయపర్తి మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన ఎంగిలి యాకయ్య మండలంలోని రామన్నగూడెం గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు స్థానిక ఎస్సై శ్రవణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు మండలంలోని రామవరం గ్రామానికి బంధువుల చావుకు వచ్చి తిరిగి తన స్వగ్రామమైన ఆరెగూడెం గ్రామానికి టీవీఎస్ చాంప్ పై వెళుతున్న క్రమంలో రామన్నగూడెం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బైక్ తాకగా కింద పడిపోయి తీవ్ర గాయాలు కాగా హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంకాలం మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుని కుమార్తె అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



అంగన్వాడి సెంటర్ల ద్వారానే పోషకాహారం

నవతెలంగాణ-కొడకండ్ల

అంగన్వాడి సెంటర్ల ద్వారానే గర్భిణీలు, బాలింతలకు, పిల్లలకు పోషక ఆహార పదార్థాలు అందివ్వడం జరుగుతుందని స్థానిక తహసిల్దార్ అంజయ్య అన్నారు. శనివారం మండలంలోని రామవరం గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోషక పక్వాడ ముగింపు వారోత్సవాల్లో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పిల్లలు అంగన్వాడి సెంటర్ల ద్వారా అందించే పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు అన్న ప్రసన్న అక్షరాభ్యాస నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హరికృష్ణ, డిడబ్ల్యూఓ జయంతి, సూపర్వైజర్ సరళ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌కు మద్దతుగా గాంధీ భవన్‌కు బయలు దేరిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-దేవరుప్పుల

మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉండి కార్యకర్తలకు అనుక్షణం అందుబాటులో ఉంటూ నిరంతరం మండలంలో కాంగ్రెస్‌ని ముందుకు నడిపించి, యూత్‌కు పెద్ద పీట వేసిన నాయకుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌ను అకారణంగా పదవినుంచి తొలగించి ప్రస్తుతం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షునిగా ఉన్న నల్ల శ్రీరామ్‌ను దేవరుప్పుల మండలాధ్యక్షుడిగా నియమించిన సంగతి అందరికి తెలిసిందే. అందులో భాగంగా శనివారం మండలకేంద్రంలోని జనగామ-సూర్యాపేట రహదారి చౌరస్తా నుండి పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని 32 గ్రామాల నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సుమారు 50వాహనాలలో వందలామంది హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌కు బయలుదేరారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌కు న్యాయం జరిగేటట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ నుండి బీజేపీలో చేరిక

లింగాలఘనపురం : మండలంలోని నెల్లుట్ల సమీపంలో వడ్డెరకాలనీ జనగామ జిల్లా బీజేపీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత రెడ్డి అధ్యక్షతన మండల బిజెపి అధ్యక్షులు ప్రజ్ఞాపురం ఆంజనేయులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చేర బుడ్డి రమేష్ రెడ్డి సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. ఏదునూరి నాగరాజు, పగిడిపల్లి వెంకటేష్, చెన్నూరి ఆనంద్, ఇట్టబోయిన మహేందర్, భీమగాని మహేందర్ బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుడుగుల రమేష్, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
మహబూబాబాద్
4
ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

త్రాగునీటి కొరత రాకుండా చూడాలి : డీపీవో హరిప్రసాద్



నవతెలంగాణ-మరిపెడ

రాబోయే వేసవిలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త పడాలని డిపిఓ హరిప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారంమరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డితో కలిసి డిపిఓ హరిప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిపెడ మండలంలో పైపుల లీకేజీలు, పాత బోర్ వెల్స్ రిపేర్ చేయించాలని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయమార్గాలఅన్వేషించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీ ఈ కే అనుష, గ్రేడ్ డీఈ స్వామి దాస్, ఎంపీడీవో జీ రేవతి, ఎంపీఓ పూర్ణచందర్ రెడ్డి, ఏఈలు విష్ణు, రాకేష్, ప్రదీప్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన నూకల నరేష్ రెడ్డి



నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నూకల నరేశ్ రెడ్డి ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే, శనివారం ఖమ్మంలో నూకల నరేష్ రెడ్డి తన చిరకాల మిత్రుడైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. పార్టీలో నూకల నరేష్ రెడ్డికి మంచి భవిష్యత్తు ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నరేష్ రెడ్డికి భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది.

పోషకాహారంతోనే ఆరోగ్యం : హరినాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

పోషకాహారంతోనే శిశువుల్లో ఆరోగ్యం వెల్లివిరుస్తుందని కౌన్సిలర్ వి.హరినాయక్ అన్నారు. శనివారం మహబూబాబాద్ మండలం అమనాగల్ సెక్టార్ పరిధిలోని శనగపురం గ్రామ అంగన్వాడీ కేంద్రం నందు పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 9 వార్డ్ కౌన్సిలర్ హరి నాయక్, సూపర్వైజర్ ఎం.భవాని మాట్లాడారు. పోషకాహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందని, పిల్లలకు ప్రీ స్కూల్ విద్యను అందిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్స్ మిల్లెట్ ఫుడ్ ఐటమ్స్ ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి తల్లులు,కిషోరబాలికలు,అంగన్వాడీ టీచర్స్ సుభాషిణి, పుష్ప, పద్మ లింగమ్మ పంకజ, సక్కుబాయి, వెంకటమ్మ, తార, శారద పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

నవతెలంగాణ-తొర్రూరు

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం టెట్ పరీక్ష ఫీజును వెయ్యి రూపాయలకు పెంచి నిరుద్యోగుల పాలిట గుదిబండలా తయారైందని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మారపు పవన్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక విశ్రాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో టెట్ పరీక్షకి పేపర్-1, పేపర్-2 రెండింటికి కలిపి కేవలం 600 రూపాయలు మాత్రమే ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టెట్ పేపర్-1 పరీక్ష ఫీజు 1000 రూపాయలు, టెట్ పేపర్-2 పరీక్ష ఫీజు 1000 రూపాయలు పెంచడం వలన తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులు అందరు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చేనిదినవారే ఉండటం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తమ ఆదాయాన్ని సమాకుర్చుకోవడం కోసం నిరుద్యోగుల నుండి వేల రూపాయలు వసూలు చేయడం సరైంది కాదని పవన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు మంద గణేష్, తొర్రూర్ మండల అధ్యక్షులు రాయి శెట్టి రాజశేఖర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గూడెల్లి మధు, సంఘం నాయకులు మీడుతపల్లి సురేష్, తండ సురేష్, బలుగుల ఉపేందర్, సతీష్, యాకన్న, వేణు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి : మహేష్

నవతెలంగాణ-తొర్రూరు

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ సత్తా చాటాలని యూత్ కాంగ్రెస్ తొర్రూరు పట్టణ అధ్యక్షులు బసనబోయిన మహేష్ యాదవ్ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు శనివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో తొర్రూరు పట్టణం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వచ్చే విధంగా యువత కృషి చేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుండి 50 వేలపై మెజార్టీ వచ్చేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-మరిపెడ

వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అర్థశాస్త్రం విభాగంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనపరిచి తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారు. శనివారం మరిపెడ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.కవిత మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలికితీయటంలో క్విజ్ పోటీలు దోహదపడతాయని అన్నారు. ఈ క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు గ్రీష్మి కమైనా ప్రత్యూష, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్‌ను ప్రత్యేకంగా ప్రిన్సిపాల్ అభినందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ ఏజే రామారావు పాల్గొన్నారు.

తొర్రూరు అంగడి వేలం వాయిదా

నవతెలంగాణ-తొర్రూరు

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 28న జరగాల్సిన తొరూరు మున్సిపాలిటీ పరిధిలోని పశువులు, మేకలు, గొర్రెలు, తై బజార్ అంగడివేలం వాయిదా పడినట్లు కమిషనర్ శాంతికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగడికి సంబంధించిన కరపత్రాలు మున్సిపాలిటీ పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలకు పోస్టు ద్వారా పంపించడం జరిగిందన్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమావళి నిబంధన మేరకు ఈనెల 28న జరగాల్సిన అంగడి వేలంను వాయిదా వేసినట్లు, రిగి ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వేలం తేదీని ప్రకటించడం జరుగుతుందని, కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు దీనిని గమనించాలని కమిషనర్ శాంతికుమార్ తెలిపారు.

తొర్రూర్ అర్బన్ మండల ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్

నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూర్ అర్బన్ మండల కార్యదర్శిగా చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఇతను భారతీయ జనతా పార్టీలో గత 12 సంవత్సరాల నుండి వివిధ బాధ్యతలు స్వీకరించారు. తన పై నమ్మకంతో తిరిగి నాకు బీజేపీ తొర్రుర్ మున్సిపల్ అర్బన్ ప్రధాన కార్యదర్శిగా నాకు అవకాశం కల్పించిన తొర్రుర్ అర్బన్ అధ్యక్షులు అలిసేరి రవిబాబు, మానుకోట జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మొసంగి మురళి, ధర్మారావు వెంకన్న, తొర్రుర్ మున్సిపల్15వ వార్డు కౌన్సిలర్ జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి : ఎస్పీ



నవతెలంగాణ-గంగారం

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా మహబుబాబాద్ జిల్ల పరిధిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని మహబూబాబాద్ జిల్ల ఎస్పీ సుధీర్ రామ్నాథన్ కేకన్ తెలిపారు. శనివారం ప్రజలు తామ ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగేలా జిల్లకు వచ్చిన సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యత్మక గ్రామాలు, నక్సల్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహబుబాబాద్ డిఎస్పి తిరుపతి రావు, గూడురు సిఐ బాబురావు, స్థానిక ఎస్సైలు నగేష్, దిలీప్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి పక్షాలే లక్ష్యంగా... మోడీ జేబు సంస్థగా... ఈడీ

- కేంద్ర ఏజెన్సీలతో దాడులు అమానుషం
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం
- సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్

నవతెలంగాణ-మహబూబాబాద్

కేంద్రంలోని ఈడీ అనేది ప్రతిపక్షాలే టార్గెట్‌గా మోడీ జేబు సంస్థగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదల శ్రీనివాస్ విమర్శించారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ అధ్యక్షత వహించగా శనివారం మానుకోటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశంలో లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికలు తేదీలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎలాగైనా మళ్ళీ అధికారంలోకి రావడానికి చూస్తున్నదని, 400కు పైగా సీట్లు గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నదని అన్నారు. సిద్ధాంత పార్టీగా గొప్పలు చెప్పుకునే ఆ పార్టీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలను వేటాడేందుకు బీజేపీ ప్రభుత్వం ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఈడీను ఉపయోగిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీ వ్యూహం రాజకీయంగా ప్రతిపక్ష పార్టీలను తమ గుప్పెట్లో పెట్టుకొనే యత్నాలు చేస్తున్నదన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే కేజ్రీవాల్ సహా పలువురు ముఖ్య నేతలను అరెస్టు చేశారు. భూ కుంభకోణంలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్, మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వంలోకి అజిత్ వర్గం, తమిళనాడులో డీఎంకే నాయకులపై దాడులు ఇండియా కూటమిని బలహీన పర్చే యత్నంలో భాగంగా ఈ దాడులు చేస్తున్నారని విమర్శించారు. లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్రలేని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం దుర్మార్గం అని అన్నారు. మోడీ హఠావో... దేశ్ బచావో... బీజేపీ విభజన రాజకీయాలు సిగ్గు చేటు.. భారత దేశంలోని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నదన్నారు. రాజ్యాంగ పరంగాఎన్నికల్లో ప్రజలచే ఎన్నికోబడినా ప్రభుత్వలను కూలగొట్టి ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు గమనిస్తున్నారని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం ప్రజల చేతిలో కూలిపోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సూర్నపు సోమయ్య, అల్లి శ్రీనివాస్ రెడ్డి, రావుల రాజు, నగన్న, తోట శ్రీనివాస్, బూర్గుల లక్ష్మణ్, బానోతు బాబు, మోతి లాల్, బానోతు ప్రకాష్, దుంప భద్రజి, భూక్య శ్రీను, వీరేశ్, రాజేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్లాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పు

నవతెలంగాణ-మహబూబాబాద్/మరిపెడ

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికతో అధికార యంత్రంగా ముందుకు వెళ్లాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పు ఆదేశించారు. శనివారం మహబూబాబాద్ శివారులోని ఫిల్టర్ బెడ్స్, మిషన్ భగీరథ (గ్రీడ్) త్రాగునీరు అందించే వనరులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడారు. మహబూబాబాద్ పట్టణం, జిల్లాలోని మరిపెడ, మిషన్ భగీరథ-గ్రిడ్, పాలేరు, వరంగల్ సెగ్మెంట్ (మహబూబాబాద్ జిల్లా) త్రాగునీరు అందించే ప్రాజెక్టులను, నీటి శుద్ధిప్రక్రియ, పంపు హౌస్, ల్యాబ్, సందర్శించి సంబంధిత ఇంజనీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మున్సిపల్ పరిధి, గ్రామాలలో త్రాగునీరు సమస్య లేకుండా పక్కా ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహబూబాబాద్ పట్టణ, జిల్లా ప్రధాన వాటర్ సోర్స్, ఏటిగడ్డ ఫిల్టర్ బెడ్, (మున్నేరు వాగు), మిషన్ భగీరథ, పాలేరు వరంగల్ సెగ్మెంట్ (గ్రీడ్) ద్వారా జిల్లాలో సుమారు (1701) గ్రామాలకు మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా అవుతుందని, వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు జిల్లాలో ఇప్పటికే పలు దఫాల్లో త్రాగునీరుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి అధికారులకు తగు ఆదేశాలు, సూచనలు జారీ చేశామని అన్నారు. విద్యాసంస్థలు, (హాస్టల్లు), మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్, తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని వార్డులకు, జిల్లాలోని (461)గ్రామపంచాయతీ పరిధిలలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుంటూ, గ్రామాల్లో మరమ్మత్తులలో ఉన్న చేతి పంపులు, బోర్లు , మంచినీటి బావులు, తదితర వాటర్ సప్లై వనరులను వాడుకంలోకి తేవడానికి క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ రవీందర్, డిఈ ఉపేందర్, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.సురేందర్, డిఈ స్వామి దాస్, ఎంపీడీవో రేవతి, ఏఈ నిశాంత్, తదితరులు ఉన్నారు.



త్రాగునీటి కొరతను నివారించాలి

- సీపీఐ (ఎం) మండల కార్యదర్శి దుండి వీరన్న

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో తాగునీటి కొరత ఏర్పడుతుందని అధికారులు స్పందించి వెంటనే తాగునీటి కొరతను నివారించాలని సిపిఎం మరిపెడ మండల కార్యదర్శి దుండి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మరిపెడ మండలంలో 44 గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డులు ఉన్నాయని తెలిపారు.125 హెబిటేషన్ పరిధిలో 133 ఓహెచ్ఎస్ఆర్ ఉన్నట్లు తెలిపారు. ఈ పరిధిలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ నుండి తాగునీరు సక్రమంగా అందడం లేదని పలు గ్రామాల నుండి ఫిర్యాదులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేగాక గిరిజన తండాలలో తాగునీటి కొరత ఏర్పడి వ్యవసాయ బావులు నుండి తెచ్చుకుందామన్న బావులు అడుగంటి పోతున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఆకేరు మున్నేరు పాలేరు వాగులు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు జలాశయాలు అందుబాటులో లేకుండా పోయినట్లు తెలిపారు. మిషన్ భగీరథ నుండి రావాల్సిన త్రాగునీరు పాలేరు రిజర్వాయర్ నీటి కొరత ఉండడంతో మిషన్ భగీరథ సరఫరా అవుతున్న త్రాగునీరు మారుమూల ప్రాంతాలకు అందడం లేదన్నారు. తాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

మానుకోట డీఆర్డీఏ పీడీ సస్పెన్షన్

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా డిఆర్డిఏ పీడీగా పనిచేస్తున్నడీ.పురుషోత్తంను సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ సుల్తానియ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పురుషోత్తంకు అందజేశారు. పురుషోత్తం ఈ ఏడాది ఫిబ్రవరి 15న భూపాలపల్లి జిల్లా నుంచి వచ్చి మానుకోటలో డిఆర్డిఓ పిడిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఇక్కడ పని చేసిన డిఆర్డిఏ పిడి సన్యాసయ్యను ఖమ్మం జిల్లా బదిలీ చేశారు. భూపాలపల్లి జిల్లాలో డిఆర్డిఏ పీడీగా పని చేసిన సమయంలో ఆర్థిక లావాదేవీలు అక్రమాలు జరిగినట్లు సమాచారం ఆర్థికలావేదేవీల అంశాలను పుస్తకాలను రికార్డులను అక్కడి అధికారులకు అందజేయకుండానే ఆయన బదిలీపై మానుకోటకు వచ్చారు. లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయినట్లు అధికారులు తేల్చారు. ఈ మేరకు అక్కడ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేయగా ప్రభుత్వం ఆయనను సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

భగత్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహబూబాబాద్

భగత్ సింగ్‌ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని భగత్ సింగ్ పోరాట స్ఫూర్తికి భారతరత్న ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వ్యక్తుల్లో మహనీయుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో ఉన్న యువతరం భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ వర్ధంతి అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గందసిరి జ్యోతి బసు, నాయకులు వీరేందర్, మహేష్, వినయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు : దేశంలో కనీస ప్రజాస్వామ్యాన్ని కూడ అమలు కాకుండా భారత దేశాన్ని ఒక జైలుగా మారుస్తున్న కేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై విద్యార్థి యువకులు భగత్ సింగ్ స్ఫూర్తితో సమరశీల పోరాటాలు చేయాలని పివైఎల్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శులు ఇరుగు అనిల్, భూక్యా సంతోష్‌లు పిలుపు నిచ్చారు. షాహిద్ భగత్ సింగ్ రాజగురు సుఖదేవుల వర్ధంతి సందర్భంగా శనివారం తొర్రూరులోని గాంధీ విగ్రహం వద్ద వీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని, అది ఇచ్చిన కనీస ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కార్ హిట్లర్ వారసుడిగా నిరూపించుకుంటున్నాడని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు, మంత్రులను, అధికారులను అన్యాయంగా జైల్లో పెడుతున్నారని దుయ్యబట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో మోడీ సర్కార్ తగిన గుణపాఠం చెప్పాలని విద్యార్థి యువకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం తొర్రూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి సెగ్గేం యాకయ్య, వీరన్న, వెంకట్, ప్రశాంత్, రాము, హరీష్ పాల్గొన్నారు.

గార్ల : స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని మండలంలోని మద్దివంచ గ్రామంలో శనివారం సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖా కార్యదర్శి దూపాటి జనార్దన్, రాగం సత్యనారాయణ, కట్టెబోయిన భిక్షమయ్య, పిచ్చయ్య, భిక్షం, బాబురావు, సర్వర్ మియా, దాదేమియా, భిక్షం, ప్రవీణ్, ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో...

భగత్ సింగ్ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌టిసి బస్సు స్టేషను సమీపంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్,కుమార్, ఉదయ్,ప్రతాప్, క్రాంతి ఉన్నారు.

నెల్లికుదురు : షాహిద్ భగత్ సింగ్, రాజు గురు, సుకుదేవ్‌ల వర్ధంతిని ఘనంగా నిర్వహించినట్లు పివైఎల్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు అనిల్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పిడిఎస్‌యు సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు, పివైఎల్ నాయకులు గణేష్, స్టాలిన్, రోహిత్, రాజు, బన్నీ, మహేష్, తదితరులు పాల్గొన్నారు,

పకడ్బందీగా ఎల్‌సిడిసి సర్వే : వనాకర్ రెడ్డి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

డివిజన్ పరిధిలో గల ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపట్టిన లేప్రోసి కేసు డిటెక్షన్ క్యాంపెన్లో భాగంగా కుష్టు వ్యాధి సర్వే ఈ నెల 11 నుండి పకడ్బందీగా 24 వరకు నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనకర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కుష్టు వ్యాధి సర్వేలో మొత్తం 268 టీములు కలిసి 7319 గృహాలను సందర్శించి పరీక్షలు నిర్వహించగా 646 అనుమానిత కేసులను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించి రెండు మల్టీ బిస్లరీ కేసులను గుర్తించి మల్టీ డ్రగ్స్ థెరపీ అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ విజయ్ కుమార్, కృష్ణ, స్థానిక ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు జాతీయ కార్యదర్శిగా భాస్కర్

నవతెలంగాణ-నెల్లికుదురు

జాతీయ మాల మహానాడు జాతీయ కార్యదర్శిగా నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన ఆశోద భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ తెలపడం పట్ల హర్ష వ్యక్తం ప్రకటించినట్లు జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కరించడంపై కొన్ని ఏళ్ల నుండి ఎన్నో పోరాటాలు చేశాడని, ఎన్నో పదవులు చేపట్టి ఎంతో మంది అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తి అని అన్నారు. అలాంటి వ్యక్తికి ఈరోజు హైదరాబాదులో మాల మహానాడు జాతీయ కార్యదర్శిగా ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ రావుకి రుణపడి ఉంటామని అన్నారు రానున్న రోజుల్లో కూడా మాలల అభివృద్ధి కోసం మా మండలం ఎంతో ముందుండి సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు బాబురావు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరు రమేష్ తో పాటు కొంతమంది ఉన్నారు

ఎన్నికలుప్రశాంతంగా నిర్వహించాలి : డీఎస్పీ

నవతెలంగాణ-గూడూరు

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు అన్నారు.శనివారం గూడూరు మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి తిరుపతిరావు మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం, గంజా, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్ట్ దగ్గర, డివిజన్లో పరిధిలో ఆకస్మికంగా పకడ్బందీగా నాఖబంది, వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబుబాబాద్ డిఎస్‌పి ఎన్.తిరుపతి రావు, గూడురు సీఐ బాబురావు, ఎస్ఐ నగేష్ కొత్తగూడ ఎస్ఐ దిలీ గంగారం, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి







నవతెలంగాణ-గార్ల

గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఎల్లప్పుడూ పౌష్టిక ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని డోర్నకల్ సిడిపివో ఎల్లమ్మ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసిడియస్ అధ్వర్యంలో శనివారం పోషణ పక్వాడ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీలకు సాముహిక సీమంతాలు,చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు రాగులు,కొర్రలు,జొన్నలుసజ్జల్లో విటమిన్స్ అధికంగా ఉంటాయని వాటితో పాటు ఆకుకూరలు, కూరగాయలు తింటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సంపూర్ణ, గోపమ్మ, చైల్డ్ లైన్ అధికారులు కళ్యాణి, సాయి,అంగన్ వాడీ టీచర్లు నీలా, టి.పద్మ, బి.కృష్ణవేణి, సుజాత, వసంత, రుక్కమ్మ, విక్టోరియా, అయాలు పాల్గొన్నారు.

తొర్రూర్ రూరల్ : మండలంలోని ఫతేపురం ఐసిడిఎస్ మాటేడు సెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమం సూపర్వైజర్ జలగం సునీత అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ హైమావతి మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు రక్తహీనత కలిగినటువంటి పిల్లలకు పోషక విలువలు కలిగిన తాజా కూరగాయలు ఆకుకూరలు గుడ్లు పాలు తృణ ధాన్యాలు రోజువారి ఆహారంలో కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శైలజ, పద్మ జ్యోతి, ప్రసూన, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : మండలంలోని రాజుల కొత్తపల్లి గ్రామ సెక్టర్ పరిధిలో అంగన్వాడి టీచర్లతో కలిసి ఘనంగా పోషక పక్షం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ సెక్టర్‌ల సూపర్వైజర్లు మల్లీశ్వరి ఉషారాణి నాగమణి విజయలు తెలిపారు. మండలంలోని రాజుల కొత్తపల్లి సెక్టార్ సూపర్వైజర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో పోషణ పక్షంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు అన్నప్రసన చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజులకొత్తపల్లి సెక్టార్లో పోషణ పక్షంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు అన్నప్రాసన అక్షరాభ్యాసం మొదలైన వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఫుడ్ ఎగ్జిబిషన్, ప్రీ స్కూల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం బాల్య వివాహాలు, లింగ వివక్షత, భ్రూణ హత్యలు మొదలగున వాటిపై ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజులకొత్తపల్లి ప్రైమరి స్కూల్ హెచ్ఎం సోమిరెడ్డి ఈ ఐసిడిఎస్ నెల్లికుదురు వావిలాల సూపర్వైజర్లు నాగమణి ఉషారాణి ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి యాకుబ్ రెడ్డి పల్లె దావకాన డాక్టర్ సంధ్య అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి



నవతెలంగాణ-గూడూరు

గర్భిణీ స్త్రీలు బాలింతలు పౌష్టిక కరమైన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవం తంగా ఉంటారని గూడూరు ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి తెలిపారు. మండలంలోని చిన్న ఎల్లాపురం పంచాయితీ పరిధిలోని అంగన్వాడి సెంటర్ల ఆధ్వర్యం లో శనివారం పౌష్టిక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ కళావతి మాట్లాడుతూ రాగులు సజ్జలు, కొర్రలు, జొన్నలలో విటమి న్స్ ఎక్కువ ఉంటాయని వాటితోపాటుఆకుకూరలు, కూరగాయలు తింటే ఆరోగ్యంగా ప్రయోజనాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న ఎల్లపురం అంగన్వాడీ టీచర్ సునీత, షౌరి, ఆయా లక్ష్మి గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
5
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

పాఠశాల ఫ్రిడ్జ్‌కు మరమ్మతులు

నవతెలంగాణ-గణపురం



మండలంలోని చెల్పూర్ ప్రభుత్వ సెకండరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతుండగా జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆధ్వర్యంలో శనివారం మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు. కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్, టాప్స్, సింగ్స్, రిపేర్‌లో ఉండడంతో విద్యార్థులు తాగడానికి నీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల ఉపాధ్యా యుడు జయ శంకర్ ఫౌండేషన్ వారి దృష్టికి తీసు కెళ్లడంతో వెంటనే ఫౌండేషన్ చైర్మెన్ మారుతి స్పందించి వాటర్ ఫ్రిడ్జికి మరమ్మతులు చే యించారు. ఈ సంద ర్భంగా మారుతికి విద్యా ర్థులు, ఉపాధ్యాయులు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ యూత్‌ఇన్చార్జ్ చింతకింది రాజు, ఫౌండేషన్ చెల్పూర్ గ్రామ ప్రెసిడెంట్ అంకాల సాయి, బుక్క రవి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్

నవతెలంగాణ-టేకుమట్ల



అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్ తప్పదని ఎస్సై ప్రసాద్ అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్ (వి) గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన నలివెల నాగరాజు, చెక్క వెంకటేష్ రెండు ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా స్థానిక గ్రామపంచాయతీ వద్ద రెండు ట్రాకర్లను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ ఇసుక అక్రమ తరలింపు చట్టరీత్యా నేరమని, చట్టానికి అందరూ కట్టుబడి ఉండాలని, అనుమతులు లేకుండా ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ మధుకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి సింహ వాహన సేవ

నవతెలంగాణ-రేగొండ

మండలంలోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొడవటంచ గ్రామంలో శనివారం జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహస్వామి సింహ వాహన సేవ ఘనంగా జరిపారు. ఆలయ అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాస చార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని గ్రామంలోని మాడవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సింహవాహన సేవ, నిత్య విధి పూజలు, హోమం, బలిహరణం సేవలు తదుపరి అరగింపు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాత్రి గరుడోత్సవం, సదాస్యము కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ముల్కనూరి బిక్షపతి, కమిటీ సభ్యులు మల్లెబోయిన శ్రీధర్, మూల ఓంకార్, డోబిలి కోటేశ్వర్‌రావు, కనుకుంట్ల జోగేందర్, పేరాల తిరుపతి, పోలుసాని శ్రీనివాస రావు, లింగంపెల్లి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ సమ్మయ్యకు పరామర్శ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన భూపాలపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ బద్ధి సమ్మయ్యను శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోని, ఆరోగ్యంపై మనోధైర్యం ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మల్లేష్‌యాదవ్, ప్రదీప్, తదితరులు ఉన్నారు.



వాగ్దేవి పాఠశాలలో హోలీ సంబరాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ సంబురాలు వైవభంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ రాగం కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ఒక్కరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వనిత, సంధ్య, లావణ్య, ఉషారాణి, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గణపురం :మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎంజీఎం హైస్కూల్‌లో శనివారం ముందస్తుగా హోలీ సంబరాలను జరుపుకున్నారు. వివిధ రకాల రంగులు పూలతో విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ బద్ధంగా ఒకరికొకరు ఆపాదించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ హోలీ పండు విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపల్ మధుకర్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలిమెల పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహాదేవపూర్ ఉమ్మడి మండలంలోని పలిమెల పోలీసుస్టేషన్‌ను శనివారం కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవ్‌పూర్ సీఐ రాజేశ్వర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గోదావరి తీరప్రాంత గ్రామాలు, మావోయిస్టులు దాటడానికి అనుకూలంగా సర్వాయిపేట, దమ్మూరు, బూరుగుగూడెం, నీలంపల్లి, బండారిగూడెం, ముకునూర్ వంటి గ్రామాలను ఆనుకొని ఉన్న ఫెర్రీ పాయింట్లను తనిఖీ చేసి ప్రస్తుత పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చేపలు పట్టే వారు, పడవలు నడిపే వారితో మాట్లాడి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముకునూర్, పలిమెల గుత్తికోయగూడెంలోని గుత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో పలిమెల ఎస్సై థామస్‌రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు, సివిల్ టీఎస్ఎస్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

మండలంలోని రాపల్లి కోట-సూరారం క్రాస్‌రోడ్ వద్ద శని వారం మహాదేవపూర్ ఎస్సై కె ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహన దారులకు జరిమానా విధించారు. అనుమానితులను ప్రశ్నించి వదిలి పెట్టారు.ఈ మధ్య కాలంలో మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాలలో వరుస ఎన్‌కౌంటర్లతో పాటు మావోయిస్టులు మందు పాతరలు పేల్చడం వంటి సంఘటనలు జరుగుతున్నడంతో రాష్ట్ర సరిహద్దులో పోలీసులు తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్సైలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే సీపీఐ(ఎం) లక్ష్యం

ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు

నవతెలంగాణ-భూపాలపల్లి



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే సీపీఐ(ఎం) లక్ష్యమని భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో జరిగిన పార్టీ సమావేశానికి సీనియర్ నాయకులు వెలిశెట్టి రాజయ్య అధ్యక్షత వహించగా సాయిలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోడీ సర్కార్ నిరంకుశ వైఖరిని తిప్పికొట్టాలన్నారు. ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టులను ఖండించాలని పిలుపునిచ్చారు. గుజరాత్ గోద్రా ఘటనకు బాధ్యుడైన నరహంతక నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా ఉన్న పదేండ్లలో ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని విమర్శించారు. ఈడీలు, ఐటీలు, సీబీఐలను తమ జేబు సంస్థగా ఉపయోగించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ వ్యవస్థ ద్వారా ప్రతిపక్ష పార్టీలను లొంగదీసుకుంటున్నారని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ విధానాలను భారతదేశంలో అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి దాని స్థానంలో మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తున్నారని, చరిత్రను మొత్తం వక్రీకరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన సిద్ధాంతాన్ని పక్కన పెట్టి, టిప్పు సుల్తాన్ చరిత్రను తిరగ రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్షాల గొంతులు తీవ్రంగా నొక్కుతున్నాడని, ఇటీవల కాలంలో ఎస్బిఐ బ్యాంకు బయటపెట్టిన ఎలక్ట్రోలు బాండ్స్ వివరాలలో బీజేపీ అవినీతి బయటపడిందన్నారు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎప తీసుకొచ్చాడని, ఇటీవల కాలంలో ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు అందులో భాగమే అన్నారు. భారతదేశంలో ఇండియా కూటమికి రోజురోజు ఆదరణ పెరుగుతుందని, అధికారంలోకి ఇండియా కూటమి రాబోతుందనే సంకేతాలు బలంగా ప్రజల్లోకి వెళ్లాయన్నారు. దీన్ని అరికట్టడానికి ఇండియా కూటమికి వెన్నుపూసలా ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీని అనగదొక్కాలని బీజేపీ సర్కార్ విశ్వప్రయత్నాలు చేస్తుందన్నారు. కనీసం ఎన్నికల ఖర్చు కూడా కాంగ్రెస్ పార్టీకి లేకుండా మోడీ సర్కారు భారీ కుట్ర పన్నిందని, ప్రజలు ప్రజాతంత్ర వాదులు మేధావులు, విద్యార్థులు యువజనులు సకలజనులు కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను సీట్ చేయడం తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ఇండియా కూటమికి భారీ మెజార్టీని ఇచ్చి గెలిపించాలని, మోడీ సర్కారుకు జ్ఞానోదయం కల్పించాలని కోరారు.

యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్

నవతెలంగాణ-ములుగు

యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ గఫూర్ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గఫూర్ మాట్లాడుతూ నేటి యువకులు ముఖ్యంగా టెర్రరిజం మద్యం, మత్తు వైపు కొట్టుకుపోతున్నారని అన్ని అంశాలను డబ్బు చుట్టూ తిప్పుతూ డబ్బులు సంపాదించడమే జీవిత లక్ష్యంగా పని చేస్తున్నారని అన్నారు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో పక్క వారిని పట్టించుకోవడమే మర్చిపోతున్నారని అందుకే యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. భగత్‌సింగ్ సామ్రాజ్యవాదులు వ్యతిరేకంగా పోరాటంలో యువతను కలుపుకొని తెల్లదొరలను తరిమికొట్టేందుకు జీవితాన్ని త్యాగం చేశారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సూపరింటెండెంట్ జగదీష్ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత పెడదారిలో వెళ్తుండగా వారిని సక్రమమైన మార్గంలో పెట్టడానికి సమాజం కోసం పని చేయడానికి డీవైఎఫ్ఐ మంచి ప్రయత్నం చేస్తుందని అభినందించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ ములుగు జిల్లా కమిటీ మొదటిసారిగా భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శబిరం నిర్వహిస్తున్నామని, 30మంది రక్తదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కొర్ర రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి, డీవైఎఫ్ఐ నాయకులు జి.రాజు, వీరాస్వామి, బద్రి చలపతిరెడ్డి, రాజు, రాము, వెంకన్న, రత్నం, సాయి, సునీల్, బైరేష్, చంటి, రజినీకాంత్, రాజ్‌కుమార్, వేణు, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా న్యాయసేవాధికార సంస్థ

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి,

న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాంరెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



బాధితులకు న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు, మహిళలు, చిన్న పిల్లలు, వయో వద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వారు ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలనుకుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను నేరుగా సంప్రదించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని చైతన్య మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువతీ యువకులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి తగాదాలకు పోకుండా అందరూ రాజీ మార్గంలో సాగాలని ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అనివార్య కారణాలవల్ల ఎవరికైనా సమస్య వచ్చినట్లైతే న్యాయసేవాధికార సంస్థ తమకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూముల లెక్కతేల్చాలి



సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్

నవతెలంగాణ -ములుగు

భూదాన్ భూములు రాష్ట్రములో మొత్తం ఎన్ని? నిజాయితీగా పంపిణీ చేసింది ఎంత? ప్రభుత్వం అధీనంలో ఉన్న భూమి ఎంత? అని లెక్క తేల్చాలని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు అర్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా మహాసభలకు హాజరైన శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో గాంధీ, వినో బబావే ఆశయాలకు తిలోదకాలిచ్చి పేదవారికి పంచాల్సిన భూదాన్ భూములను రాజకీయ నాయకులు, బడా వ్యారవేతల చేతుల్లో చిక్కి వేల ఎకరాలు అన్యాక్రాంతం, అక్రమాలకు గురవుతుందని, దీన్ని పటించుకొనే ప్రభుత్వాలు లేవన్నారు. గత ప్రభుత్వం భూదాన్ భూముల విషయంలో ఇష్ట రాజ్యాంగ అక్రమాలకు పాల్పడినది అని అందుకే భూదాన్ బోర్డ్ రద్దు చేసిందని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాల లెక్కలు తేల్చి భూబాకసురుల భరతం పట్టాలని డిమాండ్ చేశారు. 1951 నెహ్రూ, వినోభాబవే అధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా ప్రారంబం అయి భూములను దానంగా పోచంపల్లి గ్రామంలో వేదిరే రామచంద్ర రెడ్డి ఇచ్చి,గ్రామాన్నికి భూదాన్ పోచంపల్లిగా పేరు తెచ్చారన్నారు.తెలంగాణ భూదాన్, గ్రామాదన్ చట్టం 1965లో ఏర్పడిందనీ తెలంగాణ ప్రభత్వం బోర్డ్ ను రద్దు చేసిన ఇప్పటికీ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతల ప్రజలను నమ్మించి, మభ్యపెట్టి పాత తేదీలతో ప్రోసిడింగ్ లు ఇస్తూ భూములను కేటాయిస్తూ, భూదాన్ భూముల అక్రమాల దందా కొనసాగిస్తూదన్నారు. ఈ భూములను కాపాడుటకు భూదాన్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూదాన భూములను పంపిణీ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులను సమీకరించి అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సభా అనంతరం సర్వోదయ మండలి జిల్లా నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ సర్వోదయ మండలి ములుగు జిల్లా అధ్యక్షులుగా ఆకిరెడ్డి వెంకట రాంమోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మందల మధుకర్‌రెడ్డి, ప్రతినిధులుగా వకులాభరణం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మహమ్మద్ అంకుష్, చిన్న కిషోర్ సభ్యులుగా మొగులుట్ల శ్రీని వాస్, జూపాక రమేష్, చిగురు దేవేందర్, ఎలగొండ శంకర్, పో రిక శ్యామలనాయక్‌ను ఎన్నుకున్నారు.

పౌష్టికాహారంతో పిల్లలకు ఆరోగ్యం

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్‌జీ



ములుగు : అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు గర్భిణులకు ఆరోగ్య వంతమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పోషణ పక్వాడ ముగింపు ఉత్సవాలను ఐసీడీఎస్ అధికారి స్వర్ణలత లెనిన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలోని గర్భిణులకు, బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన మాట్లాడుతూ పౌష్టిక ఆహారంలో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో బాలామతంతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించినట్టు తెలిపారు.కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీనివాస్‌కుమార్, జిల్లా వైద్య అధికారి అల్లెం అప్పయ్య, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి తూల రవి, జిల్లా మైనారిటీ అధికారి ప్రేమలత, సీడీపీవోలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.



అక్రమ మద్యం స్వాధీనం

ఇద్దరుపై కేసు నమోదు, కారు సీజ్

ఎక్సైజ్ సీఐ రామకష్ణ

నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

కారులో మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ రామకష్ణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని చెక్ పోస్టు వద్ద లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా టాటా ఇండికా కారులో మద్యం బాటిళ్లు కనిపించాయని సీఐ తెలిపారు. అక్కడున్న సిబ్బంది కారును అదుపులోకి తీసుకొని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి తనిఖీ చేయగా 20బీరు కాటన్లు, 3కాటన్ల క్వార్టర్లు మద్యం లభించిందన్నారు. మద్యాన్ని కొండాయి, మల్యాల వైపు తరలిస్తున్న కొండా మహేందర్, ముక్కెర రవళిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.68వేల700లు ఉంటుందన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి రవాణా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ సందీప్, కానిస్టేబుల్ తిరుపతి, నవీన్, నాగరాజు, వీరన్న శ్రీనివాస్, ప్రణవ్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ



మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన మోతే మహేష్ (24) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై కష్ణ ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మిరప తోటలో పురుగుల మందు తాగిన విషయాన్ని గమనించిన బంధువులు స్థానిక ప్రభు త్వాసుపత్రికి తీసుకెళ్లగా మహేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహేష్ కు ఇటీవల కాల్వపల్లి గ్రామానికి చెందిన భాషబోయిన రాజు, కూతురు శిరీషతో పెండ్లి సంబంధం కుదిరింది. కాగా శిరీష తండ్రి పెళ్లి చేసే స్తోమత లేదని, ఏడాది ఆగాలని తెలపడంతో మనస్తాపానికి గురైన మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

'3వ ప్రశ్నకు రెండు మార్కులు కలపాలి'

తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

నవతెలంగాణ-ములుగు



శనివారం జరిగిన పదో తరగతి గణిత పరీక్షలో 3వ ప్రశ్నకు రెండు మార్కులు కలపాలనీ, పదో తరగతి గణిత ప్రశ్నాపత్రం అభ్యసన సామర్థ్యాల భారత్వానికి అనుకూలంగా రూపొందించ బడినదినీ తెలంగాణ గణిత ఫోరం ములుగు జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్ అన్నారు. పదో తరగతి గణిత పరీక్షలో ప్రతి విద్యార్థి కనీసం మార్కులు పొంది పాస్ కావడానికి అవకాశం ఉన్నదనీ, కానీ అనుసంధాన ప్రశ్నలు పాఠ్యపుస్తకంలో లేకున్న ప్పటికీ ప్రశ్నపత్రంలో ఇవ్వడం జరుగుతున్నదన్నారు. ఇలాంటి ప్రశ్నలను పాఠ్య పుస్తకంలో చేరిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. పాఠ్య పుస్తకం నుండి సూటిగా ప్రశ్నలు అడిగి ఉంటే ప్రతి విద్యార్థి మంచి జీపీఏ సాధించేవారనీ, గణిత ప్రశ్నాపత్రంలో మూడో ప్రశ్నలో ఒక దగ్గర ఫ్లాగ్ పోల్ అని మరొక దగ్గర టవర్ అని ఇవ్వడం వల్ల విద్యార్థులు సంధిగ్ధతకు గురయ్యారని అన్నారు. ఆ ప్రశ్న అటెంప్ట్ చేసిన ప్రతి ఒక్కరికి రెండు మార్కులు కలపాల్సిందిగా 10వ తరగతి పరీక్షల విభాగ అధికారులను కోరారు.

టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలి

తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు,

ములుగు జిల్లా ఇంఛార్జీ అచ్చునూరి కిషన్

నవతెలంగాణ-ములుగు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'టెట్' దరఖాస్తు ఫీజును ఒక్క పేపర్‌కు రూపాయలు 1000, రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు రూపాయలు 2000 రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించడం అంత్యత దారుణమని, వెంటనే టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ములుగు జిల్లా ఇంఛార్జీ అచ్చునూరి కిషన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఒక్క పేపర్, రెండు పేపర్లు వ్రాసిన రూపాయలు 400 మాత్రమే ఉండేవనీ, ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన ఫీజును చూసి అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగాఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ తల్లిదండ్రులకు భారంగా మారి మానసికంగా,ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం మేగా డిఎస్సీ ప్రకటించి దీనికి అర్హతగా టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఏకంగా ఒక్క పేపర్‌కు 1000 రూపాయలు, రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు 2000రూపాయలను నిర్ణయించడం దారుణమన్నారు. తక్షణమే టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించి గతంలో ఉన్న ఫీజునే కొనసాగించాలని నిరుద్యోగ అభ్యర్థుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో : టెట్ పరీక్ష కోసం విపరీతమైన ఫీజులను పెంచి యువతను కాంగ్రెస్ ప్రభుత్వం ఆందోళనకు గురి చేస్తుందని, వెంటనే ఫీజులను తగ్గించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వనపాకల దిలీప్ అన్నారు.గత ప్రభుత్వాల దోపిడీ, నిర్లక్ష్యాన్ని నిరసించే నిరుద్యోగులు ప్రస్తుత ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వానికి తీసిపోమన్న విధంగా అడ్డగోలుగా రుసుములు పెంచడం నిరుద్యోగుల రక్తం తాగడంగానే భావించాల్సి ఉంటుందని విమర్శించారు. వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీనర్సింహాస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ములుగు

ములుగు మండలం లోని కొత్తూరు గ్రామ శివారులోని దేవుని గుట్టపై గల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ సూర్య, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాదం ప్రవీణ్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నేపాల్ రావు, ములుగు మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, దేవస్థాన కమిటీ సభ్యులు వెంకట స్వామి, అక్కల పోశయ్య, గుండె బోయిన వెంకటేశ్వర్లు పోస్టర్ ఆవిష్కరించారు.





డివైడర్‌ను ఢీకొన్న కారు

డాక్టర్‌కు గాయాలు

నవ తెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టగా ఒక డాక్టర్‌కు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన డాక్టర్ ప్రవీణ్ వరంగల్ నుండి భూపాలపల్లికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొట్టగా స్వల్ప గాయాలు. కాగా ఆయనను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.



ఏడబ్ల్యు సొసైటీ అధ్యక్షురాలి ఎన్నిక

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ రిజిస్ట్రేషన్ 542 కాళేశ్వరం జోనల్ ఐదు జిల్లాల యువజన అధ్యక్షుడు చింతల కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్ సూచన మేరకు ఏడబ్ల్యు మండలంలోని వల్లెంకుంట గ్రామశాఖ అధ్యక్షురాలుగా కొండ పెద్ద రాజమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షులు లింగమల్ల శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కొండ రాజమ్మ,కాటారం సబ్ డివిజన్ అధ్యక్షురాలు కొండూరి మమత, ఏఏప్ యు జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర సారయ్య, ఏవైయు జిల్లా ఉపాధ్యక్షుడు కేశారపు సురేందర్ పాల్గొన్నారు.



ఇసుక నిలువ చేస్తే కఠిన చర్యలు

ఇసుక డంపులు సీజ్ చేసిన ఎస్సై

నవతెలంగాణ-చిట్యాల

అక్రమంగా ఇసుక నిలువలు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గిద్దె ముత్తారం, తండా, కాలువ పెల్లి, గోపాలపూర్ ,దూదిపల్లి, గ్రామాలలో అక్రమంగా ఇసుక నిలువలను రెవెన్యూ అధికారులతో కలిసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసిన డంపులు ఏర్పాటు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో అక్రమంగా ఇసుక నిలువలు చేసిన డబ్బులు చేసిన ప్రజలు పోలీసులకు రెవెన్యూ అధికారులకు సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో పోలీసు సిబ్బంది రెవెన్యూ ఆర్ ఐ రాజు అధికారులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

స్వతంత్ర పోరాట యోధుడు భగత్‌సింగ్ వర్ధంతి, జయంతిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జయశంకర్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటీష్ వారిని ఎదిరించి వీరమరణం పొందిన గొప్ప దేశ భక్తుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం భగత్‌సింగ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ (బిఎన్ఈజీఏ) ఏర్పాటు చేయాలని వివరించారు. భగత్ సింగ్ జీవిత ఆశయాలను నేటి తరాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.నూతన విద్యా విధానం 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరబోయిన వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సముద్రాల శ్యామ్, క్రాంతి, బల్గెం రాజకుమార్, గోలి లావణ్య, ఐతవత్తుల చందన, శ్రావణి పాల్గొన్నారు.





ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి

నవతెలంగాణ-మొగుళ్లపల్లి

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో భగత్‌సింగ్ వర్ధంతిని ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భగత్ సింగ్ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర లక్ష్యం కావాలని పోరాడారని ఆయన సేవలను కొనియాడారు. కార్య క్రమంలో మాజీ సర్పంచ్ చంద్రమౌళి, చంద్ర బోస్, నిమ్మల ఓదెలు, రాజయ్య,మధుకర్, రాజయ్య, చంద్రయ్య, రాజు, రమేష్ పాల్గొన్నారు.

రేగొండ : స్వాతంత్ర్య సమరయోధుల సేవలు చిరస్మరణీయమని ప్రధాన ఉపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం రేగొండ మండలం రామన్నగూడెంతండా పాఠశాలలో ప్రఖ్యాత ఉద్యమ కారులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌థాపర్, హరి శివరాం రాజ్‌గురు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి, ప్రధానోపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్ బుర్ర సరస్వతి పాల్గొన్నారు.

బీజేపీకి శ్రీనివాస్‌నాయక్ రాజీనామా

నవతెలంగాణ-మల్హర్‌రావు

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన లావుడ్యా శ్రీనివాస్ నాయక్ శనివారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి



రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని మండల అధ్యక్షుడికి అందజేసినట్టు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి బీజేపీ నియోజకవర్గ స్థాయి నాయకుల తీరు నచ్చక పార్టీకి రాజీనామా చేసినట్టు ఆయన తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే వెల్లడించనున్నట్టు తెలిపారు. కాగా మరికొందరు మండల ముఖ్య నాయకులు కూడా మంథని నియోజకవర్గ స్థాయి నాయకుల తీరుతో అసంతృప్తితో పార్టీని వీడనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీడీపీవో రాధికారెడ్డి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, సూపర్వైజర్లు రమాదేవి నాగరాణి, మమత, అంగన్వాడి టీచర్లు సత్యవాణి, సునీత, సుజాత పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శుభానంద ముక్తీశ్వర కళ్యాణోత్సవం

నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో పదహారో పండగ సందర్భంగా శ్రీ శుభానంద ముక్తీశ్వర కళ్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది. భక్తులు, గ్రామస్తులు, అధికసంఖ్యలో పాల్గొన్నారు. శనీ త్రయోదశి సర్ప దోషపూజలు నిర్వహించారు. అంతకుముందు భక్తులు గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించి గర్భగుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలోని రాపల్లికోట గ్రామాన్ని చెందిన మోతె ఓదెలుయాదవ్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ స భ్యులను శనివారం పెద్దకోట గ్రామ యాదవ సంఘం సభ్యులు పరామ ర్శించారు. ఈ సందర్భంగా రూ.5వేల ఆర్థిక సాయం అందజే శారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల నాయకులు అప్పాల ఐలయ్యయాదవ్, యాదవ సంఘం అధ్యక్షులు పంచిక మల్లేష్ యాదవ్, కోశాధికారి కాటేపుల దేవేంద్ర యాదవ్, సంఘ నాయ కులు అనుమల రవీందర్, వెంకటస్వామి, మాజీ ఉప సర్పంచ్ బట్టి శ్రీశైలంయాదవ్, సంఘ నా యకులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఇన్స్‌స్పెక్టర్ సస్పెండ్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించి ఫోక్సో కేసులో అరెస్టయిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్స్ స్పెక్టర్ బండారి సంపత్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీచేసారు. భూపాలపల్లి జిల్లాలో సైబర్ క్రైం ఇన్స్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బండారి సంపత్ కుమార్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కేయూసి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించే సమయంలో ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. సదరు మహిళ కేయూసి పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఓ కాలనీలో నివాసం వుంటోంది. ఇన్స్ స్పెక్టర్ సంపత్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు రావడంతో భర్తతో దూరమైన మహిళతో సీఐ సహజీవనం చేయసాగాడు. దీనితో సదరు మహిళా భర్త గతంలో వరంగల్ సీపీకి ఫిర్యాదు చేయగా సంపత్ కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేసారు. కొద్ది రోజుల తర్వాత సంపత్ కుమార్‌కు సీఐగా పదోన్నతిపై భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం ఇన్స్‌స్పెక్టర్ నియమించబడ్డాడు. ఇదే క్రమంలో ఇన్స్ స్పెక్టర్ సంపత్ సదరు మహిళ వద్దకు వస్తూ పోతున్న క్రమంలో సంపత్ దృష్టి మహిళ కుమార్తెపై పడింది. ఇటీవల కాలం ఇన్స్ స్పెక్టర్ ఆ బాలికపై అత్యాచారానికి యత్నించాడు. ఈ సంఘటనతో సదరు మహిళ కేయుసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్‌స్పెక్టర్‌ను ఫోక్సో కేసు క్రింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్స్‌స్పెక్టర్ సంపత్‌పై శాఖపరమైన తీసుకునే చర్యల్లో భాగంగా భూపాలపల్లి సైబర్ క్రైమ్ ఇన్స్ స్పెక్టర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
ఆదివారం | మార్చి 24, 2024 | www.navatelangana.com

భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శనీయం





నవతెలంగాణ-హసన్‌పర్తి

దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు నేటి యువతకు ఆదర్శనీయమని, వారి స్ఫూర్తితో ఉపాధికై ఉద్యమించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మంద సుచందర్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎర్రగట్టుగుట్ట వద్ద భగత్‌సింగ్, రాజగురు, సుదేవుల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుచందర్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి నవ్వుతూ ఉరికంబాలు ఎక్కిన యువకిశోరాలు చరిత్రలో నిలిచిపోయారన్నారు. చిన్న వయసులోనే దేశం కోసం పనిచేయాలని ఆనాడే వారికి ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. దేశం కోసం జరిగిన పోరాటంలో యువతను చైతన్యవంతం చేయడంలో వారు అగ్ర భాగాన నిలిచారన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూనే ప్రజల్లో ఉన్న మూఢవిశ్వాసాలను తొలగించడంలో వారు కీలక పాత్రను పోషించారన్నారు. అమరవీరుల స్ఫూర్తితో దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మౌనిక. రమణా రెడ్డి, చందు, రమేష్, వంశీకష్ణ, మెట్టు సమ్మయ్య పాల్గొన్నారు.

న్యూ లయోలా హైస్కూల్‌లో...

హనుమకొండ చౌరస్తా : న్యూ లయోలా హైస్కూల్లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటానికి కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఈ దేశం కోసం చేసిన త్యాగాల గురించి వారి పోరాటాల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. మార్చి 23 ఒక గొప్పతనాన్ని భగత్‌సింగ్ స్నేహితులు చేసినటువంటి త్యాగాల గురించి భారత స్వతంత్ర పోరాట చరిత్ర భగత్ సింగ్ వారి స్నేహితుల పాత్ర మీద పిల్లలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

భగత్ సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఎఐటయూసీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలోని ఆర్.జీవన్ లాల్ కాంప్లెక్స్ యందు ,భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి మాట్లాడుతూ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి రాకుండా ఎన్నికల్లో బిజెపి పార్టీని ఓడించడానికి ప్రజలు కార్మికులు భగత్ సింగ్ స్ఫూర్తితో అనేక పోరాటాలు, ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లానాయకులు మద్దేల ఎల్లేష్, కర్రే లక్ష్మణ్, కొట్టే వెంకటేష్, కృష్ణమూర్తి, శివ, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

గీసుగొండ : యువత సోషలిజం ఆధారంగా ప్రజల కోసం స్వరాజ్యాన్ని తెచ్చుకోవాలని ఆయన ఆరోజు అన్న మాటలు ఇప్పటికీ యువత మనసులో పదిలంగా ఉన్నాయని ఆయన గొప్పతనాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లం బాల కిషోర్‌రెడ్డి కీర్తించాడు. మండలంలోని మనుగొండ గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భగత్ సింగ్ 93 వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని వాటి కోసం కృషిచేయాలని కోరారు.రాజ్‌గురు,సుఖదేవ్‌ల పోరాట పటిమను యువతకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, కొమ్ము పవన్ ఎంబాడి రాము, ఎంబాడి రాజారాం, రాజమౌళి, ఓదెల రాజు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో...

ఎన్జీవోస్‌కాలనీ : స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంకోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన విప్లవవీరుల స్ఫూర్తితోనే మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ, రాంనగర్ సుందరయ్య భవన్ లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, బ్రిటిష్ పాలనలో నలిగిపోతున్న భారత ప్రజలను విముక్తి చేయడం కోసం యువతను చైతన్యవంతం చేసి పోరాటం నడపడంలో అగ్ర భాగాన నిలిచారు అన్నారు అతి చిన్న వయసులోనే దేశానికి స్వాతంత్రం కావాలని అనే లక్ష్యంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, పోరాటం చేసిన విప్లవవీరుల స్ఫూర్తిని నేటియువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వీప్లవ వీరుల స్ఫూర్తితో దేశంలో యువతకు ఉపాధి కోసం, పోరాటం చేయాలని, మతోన్మాద విధానాలపై పోరాటం చేయడమే విప్లవ వీరులకు మనం దరం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.



ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు మంద సుచందర్, జిల్లా నాయకులు శివరాత్రి కరుణాకర్, సముద్రాల అనిల్, రాజేష్ ,కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసి ఉరి కొయ్యలను ముద్దాడిన విప్లకారుడు భగత్ సింగ్ 93వ వర్ధంతిని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జాగతి విద్యానికేతన్ హైస్కూల్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెట్ ఈగ సత్యనారాయణ, హెచ్‌ఎం గోదాదేవి, ఉపాధ్యాయులు శిరీష, కవిత, సరస్వతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మోదీ ని ఓడించడమే భగత్ సింగ్ కు ఇచ్చే నిజమైన నివాళి అని ఆర్ఎస్‌పి జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ అన్నారు. భారతదేశ ముద్దుబిడ్డలు భగత్ సింగ్ రాజ్‌గురు, సుఖదేవ్ ల 93వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం లో శనివారం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి పార్టీకి 400పైగా ఎంపీసీట్లు వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని చెపుతున్న బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్ కు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం వరంగల్ జిల్లా కన్వీనర్ ఎన్నమనేని వెంకటేశ్వరరావు, గీత కార్మిక సంక్షేమ సంఘం మండల కన్వీనర్ దొమ్మటి వీరస్వామి, నాయకులు శేషనాథ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని తురుకల సోమారంలో మతి చెందిన గడ్డం వీరాస్వామి కుటుంబ సభ్యులను శనివారం మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వీరాస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యులు సర్వర్, నాయకులు గోనె సంపత్, పూజారి రామలింగం, కంటేం ఏకాంతం, మట్టపల్లి వెంకటేశ్వరరావు, బాదావత్ వెంకట్రాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల డాక్టర్ పోడేటి సంపత్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-సంగెం

పేదలు, దళితులు, అణగారిన వర్గాలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన పేదల డాక్టర్ పోడేటి సంపత్ సేవలు మరువలేనివని ప్రముఖ హైకోర్టు అడ్వకేటు, అసైన్డ్ భూమి సమితి (ఏబిఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన పల్లారుగూడ గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు, పేదల డాక్టర్ పోడేటి సంపత్ కుటుంబాన్ని, ఆయన కుమారుడు ప్రశాంత్ ను శనివారం దళిత, సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కవి, రచయిత కలకోటి సత్య, ఎలుకటి విజయ్, పోడేటి ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

కోలోరెక్టల్ కాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కోలోరెక్టల్ కాన్సర్ పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి అని కూరపాటి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. శుక్రవారం కూరపాటి హాస్పటల్ ఆధ్వర్యంలో రూపొందించిన కోలన్ క్యాన్సర్‌కు సంబంధించి ప్రజలలో అవగాహన కల్పించడం కోసం గోడపత్రికలను కూరపాటి హాస్పిటల్స్ యాజమాన్యం డాక్టర్ కూరపాటి రాధికా రమేష్ ఆవిష్కరించి చైతన్యరథంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూరపాటి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్టుపై వామపక్షాల నిరసన

- మోడీ నిరంకుశ విధానాలపై ఆగ్రహం



నవతెలంగాణ- విలేకరులు

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రధాని మోడీ ప్రతిపక్షాలపై దాడులు, కేసులు పెట్టి.. అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈసీఐఎల్ కమలానగర్ సీపీఐ(ఎం) ఆఫీసు నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సీపీఐ(ఎం) నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ ఇబ్రహీంపట్నం ప్రధాన చౌరస్తాలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వైస్సార్ కార్కిల్‌లో సీపీఐ(ఎం)–సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) వనపర్తి పట్టణ కార్యదర్శి డి.కురుమయ్య, సీపీఐ నాయకులు రమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా ఆధ్వర్యంలో ప్లకార్డులతో మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

స్టెమ్, ఎస్‌డీజీల ద్వారా గ్రామీణ పిల్లలను భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్న ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్



నవతెలంగాణ - వరంగల్

షెల్ ఇండియా మద్దతుతో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి వరంగల్‌లోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఎన్‌ఎక్స్‌ప్లోరర్స్ కార్నివాల్‌ని స్మైల్ ఫౌండేషన్ నిర్వహించింది. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా గ్రామీణ పాఠశాల పిల్లలకు స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) మరియు ఎస్‌డీజీ (యునైటెడ్ నేషన్స్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)ల పట్ల అవగాహన కల్పిస్తూనే తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో రోజంతా కార్నివాల్ నిర్వహించబడింది. కార్నివాల్ సందర్భంగా, శ్రీమతి సిక్తా పట్నాయక్, ఐఏఎస్, కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, హన్మకొండబీ శ్రీ మనోహర్ రెడ్డి, ప్రాంతీయ సమన్వయ అధికారి, ఎంజేపీ పాఠశాలలు, పూర్వ వరంగల్‌బీ శ్రీమతి వి రాధ, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్‌బీ శ్రీ శ్రీనివాసా చారి, జిల్లా సైన్స్ అధికారి, హన్మకొండబీ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాకు చెందిన జిల్లా సైన్స్ అధికారి వంటి వారు హాజరుకావటం తో పాటుగా ప్రదర్శనలో ఉన్న ఉత్తమ శాస్త్రీయ నమూనాలు మరియు స్థిరమైన ఆలోచనలను ఎంపిక చేసి, ఈ ప్రదర్శనలో పాల్గొన్న పిల్లలను ప్రోత్సహించారు.

హైదరాబాద్ పెట్ ఫెడ్‌లో ఐటీసీ నిమాయిల్‌తో పాసమ్ వీకెండ్

నవతెలంగాణ - హైదరాబాద్

100% సహజమైన చర్యనులి అందించే ఫ్లోర్ క్లీనర్ ఐటీసీ నిమాయిల్, పెంపుడు జంతువులు, పిల్లలకు గచ్చు సురక్షితంగా, పరిశుభ్రంగా ఉందని నిర్ధారిస్తుంది. భారతదేశంలోనే అతిపెద్ద పెట్ ఫెస్టివల్ హైదరాబాద్ ఎడిషన్ కోసం ఇప్పుడు పెట్ ఫెడ్‌తో భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. ఈ భాగస్వామ్యం ఐటీసీ నిమాయిల్ సురక్షితమైన గచ్చును అందించడంలో అంకితభావాన్ని, పెంపుడు జంతువులకు అనుకూలమైన శుభ్రతను అందించేందుకు తన నిబద్ధతను చాటి చెబుతుంది. ఐటీసీ నిమాయిల్ ప్రయాణంలో పెట్ ఫెడ్ హైదరాబాద్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది. మన పెంపుడు జంతువుల సురక్షత కోసం, వాటి యజమానులకు గచ్చు శుభ్రతపై అవగాహన పెంచేందుకు తన లక్ష్యాన్ని మరింత విస్తరించింది. ఐటీసీ విశ్వసనీయ ఇంటి నుంచి నిమాయిల్ వేపకు సంబంధించిన సుగుణాలతో, రసాయన అవశేషాలనుగీ వదిలిపెట్టదు.

టీడీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త రిఫరల్ ప్రోగ్రామ్

నవతెలంగాణ - హైదరాబాద్

కెనడాలోని భారతీయ విద్యార్థులకు బ్యాంకింగ్ అనుభవాన్ని సరళం చేసేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరియు టీడీ బ్యాంక్ గ్రూప్ ఒక ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ఒప్పందం రెండు బ్యాంకుల మధ్య ఇప్పటికే ఉన్న ప్రపంచ సంబంధాలను విస్తరిస్తుంది. ఈ ఒప్పందంతో, టీడీ మరియు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త రిఫరల్ ప్రోగ్రామ్‌ను ప్రకటించాయి. కెనడాలో చదువుకోవాలనుకునే విద్యార్థులను టీడీ ఇంటర్నేషనల్ స్టూడెంట్ జీఐసీ ప్రోగ్రామ్‌కి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పంపిస్తుంది. ఇది విద్యార్థులు కెనడా ప్రభుత్వ స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్ స్టడీ పర్మిట్ మార్గాన్ని సౌకర్యవంతంగా అనుసరించేలా చేస్తుంది. కెనడియన్ డాలర్ క్లియరింగ్ కోసం 2015 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధాన కరస్పాండెంట్ బ్యాంకింగ్ భాగస్వామిగా టీడీ వ్యవహరించగా, రెండు బ్యాంకుల ప్రస్తుత సంబంధాలకు అనుగుణంగా ఈ రెఫరల్ భాగస్వామ్యాన్ని రూపొందించారు. వేగవంతమైన అధ్యయన అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేందుకు కెనడియన్ ప్రభుత్వ అవసరాలలో భాగంగా, విద్యార్థులు ఆర్థిక సహకారానికి సంబంధించిన రుజువును అందించాలి. ఇది విద్యార్థులకు కెనడియన్ ఆర్థిక సంస్థ నుంచి గ్యారెంటీడ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్టిఫికేట్ ద్వారా లభిస్తుంది. టీడీ ఇంటర్నేషనల్ స్టూడెంట్ జీఐసీ ప్రోగ్రామ్ విద్యార్థులు డిజిటల్‌గా ఖాతాలను తెరచేందుకు, వారి స్టడీ వీసా మరియు జీవన వ్యయ అవసరాలను తీర్చేందుకు వారికి సహాయపడేలా రూపొందించారు.

జేసీబీ ఇండియా బల్లాబ్‌గఢ్‌లో సంబరాలు

నవతెలంగాణ - హైదరాబాద్

ఎర్త్‌మూవింగ్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్స్‌లో భారతదేశపు ప్రముఖ తయారీదారుడు జేసీబీ ఇండియా ఐదు లక్షలవ మెషీన్ విడుదల వేడుకలను బల్లాబ్‌గఢ్‌లోని కంపెనీ ఇండియా హెడ్ క్వార్టర్స్‌లో జేసీబీ గ్రూప్ చైర్మన్ లార్డ్ బామ్‌ఫోర్డ్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీబీ 1979 నుంచి భారతదేశంలో ఉందన్నారు. ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఉపయోగించబడతాయన్నారు. భారతదేశంలో ఆరు తయారీ సౌకర్యాలతో జేసీబీ 'మేడ్ ఇన్ ఇండియా' యంత్రాలను 130 దేశాలకు ఎగుమతి చేస్తుందన్నారు. ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటన్నారు. గత దశాబ్దంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై గణనీయమైన దృష్టి పెట్టిందన్నారు. మా యంత్రాల ద్వారా ఈ వృద్ధిలో భాగమైనందుకు గర్విస్తున్నామన్నారు. 1979 నుంచి భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం కొనసాగిస్తున్నామని



చెప్పారు. మా మొదటి ఫ్యాక్టరీని బల్లాబ్‌ఘర్‌లో స్థాపించామన్నారు. భారతదేశం ఇప్పుడు మా గ్లోబల్ వ్యాపారంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఇది మా అతిపెద్ద మార్కెట్లలో ఒకటన్నారు. సంప్రదాయిక యంత్రాలతో పోలిస్తే మెటీరియల్‌ని సురక్షితంగా మరింత ఉత్పాదక పద్ధతిలో ఎత్తులో నిర్వహించడానికి ఇది ఒక విప్లవాత్మక కొత్త మార్గమన్నారు.

జగిత్యాల మైనర్ల మత్తు వెనుక..

- ఆ దిశగా గుట్టుగా సాగుతున్న పోలీసుల విచారణ?
- రంగంలోకి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో దిగినట్టు సమాచారం
- గంజాయి చాక్లెట్లతో బాలికలను మత్తుకు బానిసలుగా చేస్తూ..
- రేవ్‌పార్టీలకూ తరలించిన సూత్రదారులెవరనే దానిపై కూపీ..
- గంజాయి తరలిస్తున్న ఐదుగురు విద్యార్థుల అరెస్ట్
- పాఠశాల స్థాయిలోనే పేట్రేగుతున్న 'నిషా'నిచ్చే స్నేహ 'మత్తు' హస్తాలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

జగిత్యాల జిల్లాలో గంజాయికి బానిసలై.. రేవ్ పార్టీల వరకూ వెళ్లిన బాలిక ఉదంతం ఇప్పుడు సంచలనంగా మారింది. నిండా 15ఏండ్లు కూడా లేని బాలికలను సెక్స్‌కూపంలోకి దింపేందుకు పాఠశాల స్థాయిలోనే 'నిషా'నిచ్చే స్నేహ 'మత్తు' హస్తాలు అందిస్తూ గంజాయి సప్లయి చేస్తున్నదెవరనే దానిపై గుట్టుగా విచారణ సాగుతోంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సైతం రంగంలోకి దిగి అసలు సూత్రదారులెవరనే దానిపై కూపీ లాగుతున్నట్టుగా తెలుస్తోంది. ఏదేమైనా పోలీసుల కండ్లుగప్పి రూటుమార్చి కొత్తపంథాలో వేళ్లూనుకుంటున్న గంజాయి సప్లయి ఇప్పుడు ఏకంగా 'ఉప్పెన'లా పాఠశాల విద్యార్థుల జీవితాలను ముంచేస్తున్న పరిస్థితి ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఆందోళనకు గురి చేస్తోంది.

జగిత్యాల ఉదంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే బాలికలే టార్గెట్‌గా కొన్ని సెక్స్‌రాకెట్ ముఠాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దిగినట్టు తెలుస్తోంది. పాఠశాలస్థాయి బాలురకు ముందుగా గంజాయి చాక్లెట్లను అలవాటు చేసి, వారితో బాలికలకూ చేరవేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇలా ఆ మత్తుకు బానిసలయ్యే బాలికలను 'గంజాయి కోసం అడ్డదారులు తొక్కేలా' ప్లాన్ చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఓ వైపు గంజాయి, మరోవైపు పెద్దమొత్తంలో డబ్బు ఆశ చూపుతూ వారిని హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో జరిగే సంపన్నవర్గాల రేవ్ పార్టీలకు పంపుతున్నట్టు కనిపిస్తోంది. నిండా 15, 16 ఏండ్లు కూడా నిండని బాలికలతో అర్ధనగ్న నృత్యాలతోపాటు వ్యభిచారమూ చేయిస్తూ రూ.లక్షల్లో గడిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ కోణంలోనూ గుట్టుగా విచారణ చేస్తున్న పోలీసులు అసలు సూత్రదారులు ఎవరనే దానిపై కూపీ లాగుతున్నట్టుగా తెలుస్తోంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సైతం రంగంలోకి దిగినట్టుగా సమాచారం. మరోవైపు గంజాయి మత్తే కాకుండా డ్రగ్స్ సైతం జగిత్యాలలో విచ్చలవిడిగా విక్రయాలు జరిగినట్టు ఇటీవల నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో విచారణలో తేలింది. జగిత్యాలలో ఓ ప్రయివేటు ఆస్పత్రి వైద్యుడు మత్తు ఇచ్చే డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయించినట్టు గుర్తించి వారం రోజుల కిందట పోలీసులు అరెస్టు చేశారు. ఆ డ్రగ్స్‌కు మైనర్ల మత్తుకు ఏమైనా సంబంధం ఉందా? అనే దానిపై పోలీసులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో విచారణలో వాస్తవాలు వెలుగుజేసే అవకాశం ఉంది.

గంజాయి బానిసల్లో బాలికలు

ఇటీవల జగిత్యాల జిల్లాలో బాలికలు గంజాయికి బానిసలయ్యారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో అక్కడి స్థానికుల్లో వెలుగుజూస్తున్న పలు విషయాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. అందులో ఓ ఉదంతాన్ని చూస్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థిని, మరో విద్యార్థితో కలిసి గంజాయికి బానిసైందని, నిండా 15ఏండ్లు కూడా లేని వారిద్దరూ పెండ్లి కూడా చేసుకున్నారని తెలుస్తోంది. గంజాయి ఇవ్వడం లేదని సదరు బాలున్ని వదిలేసిన బాలిక గంజాయి అలవాటున్న మరో యువకుడికి దగ్గరైంది. బాలిక ప్రవర్తనలో మార్పును గమనించిన తల్లిదండ్రులు ఓ యువకుడి వల్లే తమ బిడ్డ పరిస్థితి దయనీయంగా ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సదరు యువకున్ని మందలించి ఎలాంటి కేసూ పెట్టకుండా ఖాకీలు వదిలేసినట్టు చర్చ సాగుతోంది. పోలీసులు స్పందించకపోవడంతో సదరు బాలిక తండ్రి చైల్డ్‌వెల్ఫేర్ కమిటీని సంప్రదించగా.. వారు బాధితురాలిని విచారించగా దాదాపు 10మంది బాలికలు గంజాయి మత్తుకు బానిసైనట్టుగా గుర్తించినట్టు సమాచారం. ప్రస్తుతం సదరు బాలిక వారి సంరక్షణలో ఉన్నట్టుగా తెలుస్తోంది.

ఇలా ఈ బాలికలు గంజాయి బ్యాచ్‌తో కలిసి హైదరాబాద్ రేవ్ పార్టీలకు వెళ్లడం, రాత్రి ఇంటి నుంచి వెళ్లి రెండ్రోజుల తరువాత రావడం వంటి పరిణామాలను గమనించిన తల్లిదండ్రుల్లో పలువురు పోలీసులకు కలవగా.. మరికొందరు పరువు పోతుందన్న భయంతో లోలోపలే కుమిలిపోతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం మత్తుకు బానిసై అపస్మారక స్థితిలో స్వధార్ హోంకు చేరిన బాలిక నుంచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమైనట్టు తెలుస్తోంది. ఆ బాలిక సరిగా వివరాలు చెప్పే స్థితిలో లేకపోవడంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సమగ్ర విచారణ కోసం పోలీసులను ఆశ్రయించినట్టుగా సమాచారం.

సీలేరు టూ జగిత్యాల..

- గంజాయి సప్లయి ముఠాను అరెస్టు చేసిన పోలీసులు

విశాఖపట్నం, సిలేరు నుంచి గంజాయి తీసుకొచ్చి జగిత్యాల జిల్లాలో విక్రయిస్తున్న ముఠాను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారు గంజాయి సేవించడంతోపాటు కిలోలకొద్దీ తీసుకొచ్చి ప్యాకెట్ల రూపంలో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న విషయాన్ని గుర్తించారు. ఈమేరకు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని రాయికల్‌కు చెందిన పెనుగొంగ గణేష్, అదే ఏరియాలోని ఆల్యానాయక్ తండాకు చెందిన మాలవత్ సతీష్‌కుమార్, మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన రావులకరి నితిన్, రాయికల్ మండలం కుమ్మరపల్లికి చెందిన తోట అజయ్, ఉప్పు మడుగుకు చెందిన ఆవుల సాగర్ గంజాయికి అలవాటు పడ్డారు. వీరు కొంతకాలంగా విశాఖపట్నం, సిలేరు నుంచి గంజాయి ముఠా చానెల్ తెలుసుకుని ద్విచక్రవాహనాలపై అక్కడికి వెళ్లి కిలోల కొద్దీ తీసుకొస్తున్నారు. ఇదే క్రమంలో 10కిలోల గంజాయిలో కొంత దాచి 4కిలోల సరుకును ప్యాకెట్ల రూపంలో మార్చేందుకు శనివారం ఉదయం మల్లాపూర్ అటవీ ప్రాంతానికి బయల్దేరారు. పక్కా సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో సీఐ నవీన్, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ రేగుంట–గొర్రెపల్లి మధ్యగల అటవీదారిలో వాహనాలు తనిఖీ చేశారు. దీంతో బైక్‌పై వెళ్తున్న నితిన్ వద్ద గంజాయిని గుర్తించిన పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో నితిన్ సహా ఈ గంజాయి తీసుకొచ్చి అమ్ముతున్న ముఠాలోని గణేష్, సతీష్‌కుమార్, తోటఅజయ్, సాగర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, 10కిలోల గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

73 మంది అభ్యర్థులపై అనర్హత వేటు

ఛత్తీస్‌గఢ్ : ఎన్నికల వేళ ... ఛత్తీస్‌గఢ్ రాజకీయాల్లో సంచలనం రేగింది. ఎన్నికల నిబంధనలను పట్టించుకోని 73 మంది అభ్యర్థులపై కేంద్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. ఛత్తీస్‌గఢ్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. వీటిని పరిశీలించాక సంబంధిత అధికారులు అనర్హుల జాబితాను విడుదల చేశారు. డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి యుఎస్ బాండే మాట్లాడుతూ ... రాయ్‌పూర్ జిల్లా నుండి గరిష్టంగా 17 మంది అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించారు. ఈ అనర్హుల జాబితాను భారత ఎన్నికల సంఘం వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసిందని చెప్పారు. ఖర్చు వివరాలు తెలియజేయని లేదా ఇతర నిబంధనలను పాటించని ఈ అభ్యర్థులు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేదంటూ ... భారత ఎన్నికల సంఘం తన వెబ్ సైట్‌లో ఈ అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. అనర్హతకు గురయిన ఈ 73 మందిలో 65 మంది అభ్యర్థులు 2024 వరకు, ఎనిమిదిమంది అభ్యర్థులు 2025 వరకు ఎన్నికల్లో పోటీ చేయలేరు.

ఛత్తీస్‌గఢ్‌లోని 11 స్థానాలకు మూడు దశల్లో పోలింగ్‌ను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 19న రాష్ట్రంలో తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఏప్రిల్ 19న ఒక స్థానానికి, ఏప్రిల్ 26న మూడు స్థానాలకు, మే 7న ఏడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

ప్రజాస్వామ్యం ఖూనీ

కేజ్రీవాల్ అరెస్టుపై గెహ్లాట్

జైపూర్ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్నికల వేళ అరెస్టు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ అన్నారు. 'ఎలాంటి రుజువు లేకుండానే కేజ్రీవాల్‌పై దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంది. సిట్టింగ్ సీఎంని అరెస్టు చేసిన తీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రజలు ఎన్నుకున్న నేత ఆయన. వారేమన్నా హత్య చేశారా? వారెక్కడికైనా పారిపోయారా?' అని గెహ్లాట్ ప్రశ్నించారు. ఆధారాల్లేకుండా..ఎవరో చేసిన ప్రకటనలే కొలమానంగా ఇడి అధికారులు తీసుకోవడం సరికాదన్నారు. అయితే కేజ్రీవాల్ అరెస్టుతో ఆ రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు జరుగుతాయా లేదా అని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని గెహ్లాట్ అన్నారు.

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు

బీజేపీకి 93 శాతం విరాళాలు

- మొత్తం రూ. 2,902.87 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు
- బీజేపీకే అత్యధికంగా రూ. 2,719.32 కోట్ల బాండ్లు
- కాంగ్రెస్‌కు కేవలం 3.2 శాతమే



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

2019 ఏప్రిల్ 12 నుంచి 2019 మే 10 మధ్య 13 రాజకీయ పార్టీలు మొత్తం రూ. 2,902.87 కోట్ల ఎలక్టోరల్ బాండ్లను స్వీకరించాయి. వీటిలో అత్యధికంగా రూ. 2,719.32 కోట్లు(93 శాతం) బీజేపీ పొందింది. బాండ్లు పొందిన ఇతర పార్టీలలో కాంగ్రెస్ కేవలం రూ. 95.29 కోట్లు (3.2 శాతం) పొందింది. టీఎంసీకి రూ.36.2 కోట్లు, బీఆర్ఎస్‌కి రూ.13.6 కోట్లు, సమాజ్‌వాదీ పార్టీకి రూ.10 కోట్లు, శివసేనకు రూ.8.45 కోట్లు వచ్చాయి. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ)కి రూ.6.76 కోట్లు వచ్చాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) రూ. 2 కోట్ల చొప్పున అందుకున్నాయి. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) రూ. 1.5 కోట్లు, జనతాదళ్ (యునైటెడ్) రూ. 1 కోటి, జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్‌కు రూ.50 లక్షలు అందాయి.

కలకత్తాకు చెందిన పారిశ్రామికవేత్త మహేంద్ర కుమార్ జలాన్‌కి చెందిన సంస్థలు హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలకు అత్యధిక విరాళాలు అందించాయి.

జలాన్ సంస్థలు, మేఘా, డీఎల్ఎఫ్ గ్రూప్ 2019 ఎన్నికలకు ముందు బీజేపీ డోనర్లలో అగ్రస్థానంలో ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ మొత్తం రూ. 2,719.32 కోట్లు అందుకోగా, అగ్రదాతగా మహేంద్ర జలాన్ సంస్థలే. జలాన్‌కు చెందిన మదన్‌లాల్ లిమిటెడ్ రూ. 175.5 కోట్లు, కెవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ. 144.5 కోట్లు, ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ రూ. 14.42 కోట్లు ఇచ్చాయి.

బీజేపీకి రెండో అత్యధిక విరాళాలిచ్చిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, పీవీ. కృష్ణారెడ్డి, పీ.పీ. రెడ్డి, 2019 ఏప్రిల్–మే మధ్య రూ.125 కోట్లు విరాళంగా ఇచ్చింది. 2019 అక్టోబర్‌లో ఆదాయపు పన్ను శాఖ తన కార్యాలయాల్లో "తనిఖీ" నిర్వహించింది. తదనంతరం, కంపెనీ రూ. 980 కోట్లను ఎలక్టోరల్ బాండ్లను విరాళంగా అందించింది. కీలకమైన ప్రభుత్వ ప్రాజెక్టులను కూడా అందుకుంది.

ఈ కాలంలో బీజేపీకి ఇతర అగ్ర దాతలలో వేదాంత లిమిటెడ్ రూ. 52.65 కోట్లు, ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 50 కోట్లు, బజాజ్ గ్రూప్, పీహెచ్ఎల్ ఫిన్‌వెస్ట్ ప్రయివేట్ లిమిటెడ్ ఒక్కొక్కటి రూ. 40 కోట్లు విరాళంగా అందించాయి. పారిశ్రామికవేత్త లక్ష్మీ నివాస్ మిట్టల్ రూ.35 కోట్లు ఇవ్వగా, సన్ ఫార్మా లేబొరేటరీస్ లిమిటెడ్ రూ.31.5 కోట్లు ఇచ్చింది.

రియల్ ఎస్టేట్ సమ్మేళనం డీఎల్ఎఫ్ గ్రూప్ (డీఎల్ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్ లిమిటెడ్, డీఎల్ఎఫ్ లగ్జరీ హోమ్స్ లిమిటెడ్) ఎన్నికలకు ముందు కేవలం బీజేపీకే రూ.25 కోట్లు ఇచ్చింది. 2019 జనవరిలో భూ కేటాయింపు కేసులో అవకతవకలు జరిగాయని ఆరోపించినందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) డీఎల్ఎఫ్ కార్యాలయాల తనిఖీ నిర్వహించింది. 2019 ఏప్రిల్, మే మధ్య రూ. 25 కోట్లు విరాళం ఇచ్చింది.

అదే సమయంలో, రిలయన్స్‌కి చెందిన ముఖేష్ అంబానీ అల్లుడు ఆనంద్ పిరమల్ డైరెక్టర్‌గా ఉన్న పిరమల్ గ్రూప్, పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ బీజేపీకి రూ.20 కోట్లు ఇచ్చింది.

కాంగ్రెస్‌కు కేవలం 3.2 శాతమే

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు మొత్తం బాండ్లలో కాంగ్రెస్‌కు రూ.95.29 కోట్లు (3.2 శాతం) వచ్చాయి. ఇందులో అత్యధికంగా జలాన్‌కు చెందిన కెవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ నుంచి రూ. 20 కోట్లు, మదన్‌లాల్ లిమిటెడ్ నుంచి రూ. 10 కోట్లు వచ్చాయి. అదానీకి సంబంధించిన వెల్‌స్పన్ కార్ప్ లిమిటెడ్, వెల్‌స్పన్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ నుండి రూ. 8 కోట్లు విరాళంగా అందాయి. పిరమల్ గ్రూప్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి కాంగ్రెస్ రూ.5 కోట్లు అందుకుంది. కాంగ్రెస్‌కు ఇతర అగ్రదాతలలో భారతి ఎయిర్‌టెల్ రూ. 8 కోట్లు, ఎంఈఐఎల్ రూ. 5 కోట్లు, ముంబయికి చెందిన మోడరన్ రోడ్ మేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 6 కోట్లు విరాళంగా ఇచ్చాయి. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన సిమెంట్ తయారీ దిగ్గజం స్టార్ సిమెంట్ మేఘాలయ లిమిటెడ్ కూడా కాంగ్రెస్‌కు రూ.4.5 కోట్లు ఇచ్చింది.

టీఎంసీకి కెవెంటర్, ఐటీసీ విరాళాలు

టీఎంసీకి అగ్రదాతలలో జలాన్‌కు చెందిన కెవెంటర్, ఐటీసీ ఉన్నాయి. టీఎంసీ గత ఐదేండ్లలో రెండో అత్యధిక ఎలక్టోరల్ బాండ్లను పొందింది. 2021 అసెంబ్లీ ఎన్నికల తరువాత, 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు జలాన్ సంస్థల నుండి ఎక్కువ విరాళాలు వచ్చాయి. జలాన్‌కు చెందిన కెవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీకి అగ్రదాతగా ఉంది. ఈ కాలంలో టీఎంసీ అందుకున్న మొత్తం రూ.36.20 కోట్లలో ఆ సంస్థ రూ.20 కోట్లను ఇచ్చింది. టీఎంసీకి ఇతర అగ్రదాత దేశంలో అతిపెద్ద కార్బన్ తయారీదారు ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్. ఆ పార్టీకి రూ.5 కోట్లు ఇచ్చింది. కలకత్తాకు చెందిన ఐటీసీ లిమిటెడ్ ఈ కాలంలో పార్టీకి రూ.4.95 కోట్లు ఇచ్చింది.

జలాన్ సంస్థలు సమాజ్‌వాదీ పార్టీ, శిరోమణి అకాలీదళ్‌కి కూడా విరాళాలు ఇచ్చాయి. సమాజ్‌వాదీ పార్టీ కేవలం రూ. 10 కోట్ల విలువైన బాండ్లను క్యాష్ చేసుకోగా, అవన్నీ జలాన్‌కు చెందిన కెవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ నుండి వచ్చాయి. మొత్తం రూ.6.76 కోట్లు అందుకున్న శిరోమణి అకాలీదళ్, జలాన్‌కు చెందిన కెవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ నుంచి రూ.50 లక్షలు పొందింది. పార్టీ ఛండీగఢ్‌కు చెందిన ఫాస్ట్‌వే ట్రాన్స్‌మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి రూ. 5 కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతీ ఇన్‌ఫ్రాటెల్ లిమిటెడ్ నుంచి రూ. 1 కోటి అందుకుంది. ఈ కాలంలో జేడీయూకి కూడా రూ. 1 కోటి ఇచ్చింది. రూ. 8.45 కోట్ల విలువైన బాండ్లను ఎన్‌క్యాష్ చేసిన శివసేన, పిరమల్ గ్రూప్‌నకు చెందిన పీఆర్ఎల్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ. 5 కోట్లతో అత్యధికంగా అందుకుంది.

బీఆర్ఎస్‌కు డాక్టర్ రెడ్డీస్‌తో సహా హైదరాబాద్‌కు చెందిన సంస్థలు అగ్రదాతలు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి 2019 ఎన్నికలకు ముందు రూ. 13.6 కోట్లు అందుకుంది. అందులో రూ. 7 కోట్లు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ నుండి వచ్చాయి. పార్టీకి ఇతర అగ్ర దాతలలో హైదరాబాద్‌కు చెందిన ఎనర్జీ హోల్డింగ్ కంపెనీ మైత్రా ఎనర్జీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ (రూ. 5 కోట్లు) ఇచ్చింది. దీనిని జీఎస్ డబ్ల్యూ ఎనర్జీ గత సంవత్సరం కొనుగోలు చేసింది. ఐటీసీ లిమిటెడ్ నుంచి అదనంగా రూ.1.6 కోట్లు వచ్చాయి.

కలకత్తా, మహారాష్ట్రకు చెందిన సంస్థలు ఆప్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్‌లకు అగ్ర దాతలుగా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన బీజీ షిర్కే కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ నుండి రూ.1 కోటితో సహా ఈ కాలంలో ఆప్ రూ.2 కోట్లు అందుకుంది. ఈ రియల్ ఎస్టేట్ దిగ్గజం గత ఐదేళ్లలో అన్ని రాజకీయ పార్టీలకు అత్యధికంగా విరాళాలు అందజేసిన వారిలో 13వ స్థానంలో ఉంది. ఆప్ కూడా టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ నుండి రూ. 1 కోటిని అందుకుంది. ఇది అన్ని రాజకీయ పార్టీలకు అత్యధికంగా విరాళాలు ఇచ్చిన పదో స్థానంలో ఉంది. గత ఐదేండ్లలో మొత్తం రూ. 184 కోట్లు విరాళంగా ఇచ్చింది. టోరెంట్ గ్రూప్ చైర్మెన్ ఎమెరిటస్ సుధీర్ మెహతా ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడు.

కలకత్తాకు చెందిన అంబుజా హౌసింగ్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ నుండి 2019 ఎన్నికలకు ముందు ఎన్సీపీ మొత్తం రూ.2 కోట్లు అందుకుంది. భారతీ ఎయిర్‌టెల్ నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ రూ.50 లక్షలు అందుకుంది. ఈ సమయంలో డీఎంకే ముంబయికి చెందిన మోడరన్ రోడ్ మేకర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి రూ.2 కోట్లు అందుకుంది. ఆర్జేడీ మొత్తం 1.5 కోట్లు అందుకుంది. అందులో కలకత్తాకు చెందిన క్వాలిటీ మెయింటెనెన్స్ వెంచర్ లిమిటెడ్ (రూ. 50 లక్షలు), ఎన్సీఆర్‌కు చెందిన రిచా అండ్ కో (రూ. 50 లక్షలు), సరితా హండా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ. 30 లక్షలు) నుండి విరాళాలు అందుకుంది.